
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 27 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ) సా.6.25
సహరి(గురు) ఉ.4.39

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	37.0	24.0



గామన్ బ్రిడ్జిపై ఆందోళన చేస్తున్న కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

వంతెనల చెంతనే.. ఇసుక తవ్వేశారు..



బ్రిడ్జి కుంగిన ఎత్తు చూపుతున్న ముప్పిడి

- గామన్ బ్రిడ్జి కుంగడానికి వైసీపీ నాయకులే కారణం
- నిబంధనలు మీరి.. అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్
- వంతెనపై టీడీపీ నాయకుల ధర్నా

కొవ్వూరు, మార్చి 26 : వైసీపీ నాయకుల అక్రమ ఇసుక డ్రెడ్జింగ్ కారణంగానే గామన్ వంతెనకు ముప్పు వాటిల్లిందని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటి సభ్యులు కంటమణి రామకృష్ణా రావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరిల ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై 52వ స్తంభం వద్ద మరమ్మతులకు గురైన స్పాన్‌ను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పరిశీలించారు. గోదావరిలో అక్రమ డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఎన్నికల కమిషన్ క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు అఖండ గోదావరి గర్భాన్ని కొల్లగొట్టి ఇసుకను దోచుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో ఇసుకను ఆదాయ వనరుగా మాత్రమే చూసుకుంటూ నిబంధనలు గాలికొదిలేశారన్నారు. గోదావరి వంతెనలకు 500 మీటర్ల లోపు ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టకూడదని నిబంధనలున్నా పట్టించుకోవడం లేదన్నారు.ఈ ఐదేళ్ల పాలనలో వంతెనల చెంత ఇసుక తవ్వకాలు చేపట్టడంతో రోడ్ కం రైలు బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందన్నారు. ఇప్పుడు గామన్ బ్రిడ్జికి ఆ పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలకు తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా ఇసుకను విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు చేపట్టి దోచుకోవడమే కారణమన్నారు. గోదావరి వంతెనల చెంతనే రాత్రి, పగలు తేడా లేకుండా భారీ యంత్రాలు పెట్టి ఇసుక డ్రెడ్జింగ్ చేసి బయట ప్రాంతాలకు ఇసుక తరలించి లక్షల కోట్లు దోచుకున్నారన్నారు.గామన్ వంతెన బేరింగ్ పోయిందని ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. బేరింగ్‌కు, పిల్లర్లకు సంబంధం ఏమిటన్నారు. నిపుణులను తీసుకువచ్చి గామన్ వంతెనను పూర్తిస్థాయిలో పటిష్ట పర్చాలన్నారు. అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్ చేసి గామన్ వంతెన కుంగిపోవడానికి కారణమైన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పొత్ర శ్రీనివాసరావు, వేమగిరి వెంకట్రావు, కాగిత రఘు, యనమదల సుబ్రహ్మణ్యం, బర్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ, కండెల్లి రామారావు, కిలారి వెంకటలక్ష్మి, కిలారి రమణ, జాగారపు వీరబాబు, జనసేన నాయకులు డేగల రాము, గంగుమళ్ల స్వామి మారిశెట్టి వెంకటేశ్వరరావు, కొప్పాక విజయకుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

ఇసుక డ్రెడ్జింగ్‌తో ముప్పు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26: ఇసుక డ్రెడ్జింగ్ చేయడమే గామన్ బ్రిడ్జి కుంగిపోవడానికి కారణమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద ఉన్న ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గోదావరిలో అక్రమంగా జరుగుతున్న ఇసుక డ్రెడ్జింగ్ కారణంగానే గామన్ బ్రిడ్జికి ముప్పువాటిల్లిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ఇసుక దోపిడీ చేయడం వల్ల పిల్లర్లు కుంగిపోతున్నాయన్నారు. ఇదే పరిస్థితి రోడ్ కం రైలు బ్రిడ్జికి దాపురించిందన్నారు. అక్రమ ఇసుక తవ్వకాల వల్ల గోదావరి నదిపై ఉన్న బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. రాజమహేంద్రవరం ప్రజలకు మళ్లీ పాత రోజులు వచ్చేలా ఉన్నాయన్నారు.మా చిన్నతనంలో కొవ్వూరు వెళ్లాలంటే గోదావరి పంటు ఎక్కి కొవ్వూరులో దిగి అక్కడ నుంచి వెళ్లేవారమని.. మళ్లీ ఆ పరిస్థితులు జగన్ దయవల్ల వస్తాయోమో అన్నారు. గామన్ బ్రిడ్జి స్తంభం కుంగిపోవడం, ఇసుక తవ్వకాలపై న్యాయస్థానం జోక్యం చేసుకుని సమగ్రవిచారణ జరిపించి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు జక్కంపూడి అర్జున్ పాల్గొన్నారు.

పంకా.. పక్క చూపు..



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ముందే పంకా రెక్కలు ఎగిరిపోతున్నాయి. గాలి కబుర్లకు వేగలేక పసుపు వసంతంలోకి ఆ పార్టీ నాయకులు అడుగు పెడుతున్నారు. కొందరు సొంతింటికి చేరుకున్న ఆనందంలో ఉండగా.. మరికొందరు ఢోకా లేని కండువా నీడలోకి వచ్చామన్న సంతోషంలో ఉన్నారు.నాలుగేళ్ల పది నెలల పాటు 'గాలి'వాటం భరిస్తూ.. అహంకారం, దర్పాలకు అణిగిమణిగి ఉన్నారు. సముచిత స్థానం, తగిన గౌరవం లేకపోయినా సర్దుకుపోయారు. ఇంక భరించలేమంటూ టీడీపీని ఆశ్రయిస్తున్నారు. టీడీపీ,బీజేపీ,జనసేన కూటమి బలంగా ఉత్సాహంగా ఉరకలు వేయడంతో ఆ దారిని తమ రాజకీయ మార్గంగా ఎంచుకుంటున్నారు. వైసీపీలో ఉక్కపోత తట్టుకోలేక పసుపు కండువా నీడకు చేరుకుంటున్నారు. జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇలా మండల,జిల్లా స్థాయి నాయకులు ఇప్పటికే పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలతో 'టచ్'లో ఉన్నారనే ప్రచారం నడుస్తోంది.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే రోజూ వందల సంఖ్యలో వైసీపీ నుంచి వలస పక్షులు సైకిల్ ఎక్కుతున్నాయి. వీరిలో యూత్ భాగం కూడా చెప్పుకోదగిన స్థాయిలో ఉండడం విశేషం.

వర్గపోరును తట్టుకోలేక..

వర్గపోరు, అహంభావానికి వైసీపీ పెట్టింది పేరు. పైగా ఎప్పుడు ఎవరిని ఎక్కడి నుంచి పీకేసి ఎక్కడికి పంపిస్తారో తెలియని పరిస్థితి. అందువల్ల ఆయా నాయకుల కేడర్ అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది. ఎప్పుడు ఎవరికి జైకొట్టాలో తెలియని పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతోంది. దీంతో వైసీపీ నాయకులు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నుంచి గోడదూకిన వారికి పెద్దపీట మాట ఎలా ఉన్నా సముచిత స్థానం కూడా ఇప్పటి వరకూ వైసీపీలో దక్కలేదు. టీడీపీలో నగర, ఉన్నతస్థాయి పదవులు అనుభవించిన వారు కూడా వైసీపీ పంచన చేరారు. ఇప్పుడు వారి రాజకీయ జీవితం కుడితిలో పడ్డ ఎలక మాదిరి తయారైంది. అటు వైసీపీ పెద్దలను గట్టిగా నిలదీయలేక.. ఇటు సొంత గూటికి చేరడానికి ముఖం చెల్లక సతమతమవుతున్నారు. ఉదాహ రణకు టీడీపీలో కార్పొరేటర్‌గా పదవి అలంకరించిన వారికి వైసీపీలోకి దూకిన తర్వాత కనీసం వీధి నాయకులకు ఉన్న పాటి గౌరవం దక్కకపోవడం గమనార్హం. అయితే అలాంటి వాళ్లను బుజ్జగించే పనిలో భాగంగా నేతలు బూటకపు మాటలు చెబుతున్నారని తెలుస్తోంది. మళ్లీ ప్రభుత్వం వస్తే పెద్ద పదవులు మెడలో వేస్తామంటూ ప్రగల్భాలతో నెట్టుకు వస్తున్నారని, బుజ్జగిస్తున్నారని సమాచారం. అయితే వారి మాటలు నమ్మే పరిస్థితి లేకపోవడంతో చాలా మంది టీడీపీ, జనసేనలో చేరడానికి సిద్ధం అవుతున్నారు.

వైసీపీ ఖాళీ అవుతోందా?

కొవ్వూరు నియోజకవర్గంలోని వైసీపీలో రెండు వర్గాల నడుమ పోరు సాగుతోంది. సాధారణంగా రెండు వర్గాలతో అగ్రనేతలు మాట్లాడి సర్దుబాటు చేస్తుంటారు. అయితే ఇక్కడ ఒక వర్గాన్ని వైసీపీ పెద్దలు లెక్కలోకి తీసుకోకపోవడం వారిని తీవ్రంగా కలచివేస్తోంది. దీంతో ఒక వర్గం టీడీపీ బాట పట్టడానికి 'సిద్ధం'గా ఉంది.ఇద్దరు ఎంపీపీలు, ఒక జడ్పీటీసీ కూడా టీడీపీ వైపు చూస్తున్నారు. దీంతో కొద్ది రోజుల్లో ఆ నియోజకవర్గంలోని దాదాపుగా వైసీపీలో 'గాలి' తప్ప జనాలు మిగలని పరిస్థితి రావొచ్చు. నిడదవోలులో ఒక మహిళ అనధికార ఆధిపత్యానికి పొసగలేక చాలా మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు బాధపడిన రోజులు చాలానే ఉన్నాయి. ఇప్పటికీ పరిస్థితిలో మార్పు రాక టీడీపీ కండువా కప్పుకోడానికి 'సిద్ధం' అవుతున్నారు. పలువురు జనసేన నాయకులతో టచ్‌లో ఉన్నారు.రాజమహేంద్రవరంసిటీ నియోజకవర్గంలో మాజీ కౌన్సిలర్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒకరు టీడీపీ కండువా కప్పుకోడానికి ముహూర్తం పెట్టుకున్నారు. వైసీపీ నగర కమిటీ నాయకుడు ఇప్పటికే టీడీపీలోకి వచ్చారు. ప్రతి వార్డు నుంచీ సుమారు 200 మంది వరకూ టీడీపీలో చేరారు. ప్రతి రోజూ చేరికలు ఉంటున్నాయి. సారంగధర మెట్ట ప్రాంతానికి చెందిన 100 మంది మహిళలు సైకిలెక్కారు.రాజానగరంలో జనసేన, టీడీపీలో చేరికలు ఎక్కువగా ఉంటున్నాయి.గోకవరం మండలానికి సంబంధించి మాజీ సొసైటీ చైర్మన్ గాజింగం సత్యనారాయణ టీడీపీలో చేరారు. రెండు రోజుల్లో జనబలం బాగా ఉన్న నాయకుడు, జగ్గంపేట మార్కెట్ యార్డు చైర్మన్, మాజీ ఎంపీపీ జనపరెడ్డి సుబ్బారావు(బాబు) టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఫ్యాను కింద నుంచి పరుగున వచ్చి సైకిలెక్కడానికి మండలస్థాయి అగ్రనాయకులు ముహూర్తాలు పెట్టుకున్నారు.గోకవరం మండలంలో ఇంత పెద్ద ఎత్తున వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఇదే మొదటిసారని చెబుతున్నారు.

వైసీపీలో వలసలసల

- సైకిలెక్కుతున్న వైసీపీ నాయకులు
- కూటమి వైపు భారీగా చూపు
- అన్ని నియోజకవర్గాల్లోనూ క్యూ
- కుటుంబాలతో సహా చేరిక
- ఫ్యాన్ కింద ఉక్కబోత
- తట్టుకోలేక బయటకు
- గోకవరంలో రికార్డు

ఇక్కడ బెదిరింపులేనా?

జగన్నాటకంలో ఎన్నో చిత్రాలు చూస్తున్న జనం ఈ విషయం వింటే విస్తుపోతారు. గ్రామాలు, మండలాల్లో జనసేన, టీడీపీలోకి చేరుతున్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఆయా ప్రాంతాల్లోని 'పలుకుబడి' ఉన్న వైసీపీ వారిని పంపించి బెదిరిస్తున్నారని..అవతలి వైపు కాస్త బలం ఉన్న నాయకుడైతే నయాన వారిని 'సిద్ధం' చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి.ఇటు సిటీల్లో వార్డుల్లోని కుర్రాళ్లకు కండువాలు కప్పేసి లెక్కల్లోకి లాగేస్తున్నారని చెబుతున్నారు. ఇలా వైసీపీ అవతల పార్టీ నాయకులను భయపెడుతోంది.



మహిళా నేతలతో మాట్లాడుతున్న భువనేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత చిత్రంలో ఎస్పీ జగదీశ్ తదితరులు

తేలని అనపర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- కూటమికి మరో కొత్త తలనొప్పి
- అనపర్తి సీటుకు బీజేపీ పట్టు
- కుదరదంటున్న స్థానిక టీడీపీ కేడర్
- జఠిలంగా మారిన సమస్య
- ప్రకటించిన సీటుకు మళ్లీ పోటీ
- అయోమయంలో పార్టీ శ్రేణులు
- లేదంటే మరో స్థానానికి బీజేపీ పట్టు?

తెలుగుదేశం- జనసేన-బీజేపీ జోష్‌ను ఓ అసెంబ్లీ సీటు ఇబ్బంది పెడుతోంది. జిల్లాలో ఒక లోక్‌సభ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వాస్తవానికి ఏడు అసెంబ్లీ స్థానాలు, లోక్‌సభ స్థానానికి అభ్యర్థులు ఖరారయ్యారు. కానీ బీజేపీ అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని కోరుతుండడంతో సమస్య ఏర్పడింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే ఐదు స్థానాల్లో టీడీపీ, రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులను ఖరారు చేశారు.ఇప్పటికే టీడీపీ తన అభ్యర్థిని ప్రకటించిన అనపర్తి స్థానం కోసం బీజేపీ పట్టుపట్టడంతో సమస్య జఠిలమైంది. ఇక్కడ టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సంగతి తెలిసిందే. పైగా రామకృష్ణారెడ్డి ఇక్కడ బలమైన అభ్యర్థి. పైగా ఆయన తండ్రి మూలారెడ్డి, రామకృష్ణారెడ్డి టీడీపీలో నుంచే పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. అనపర్తిలో టీడీపీ అంటే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబమే గుర్తుకొస్తుంది. ఆయన నిత్యం సమస్యలపై పోరాటాలు చేస్తుంటారు. టీడీపీ అధిష్ఠానంతో కూడా సన్నిహితంగా ఉంటారు. ఇవాళ అనూహ్యంగా ఈ సీటు బీజేపీ కోటాలోకి పోతుందంటే టీడీపీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఇప్పటికే సుమారు 60మందికి పైగా తమ పదవులకు రాజీనామా చేశారు. రామకృష్ణారెడ్డిని ప్రచారానికి కూడా కేడర్ వెళ్లనీయడంలేదు. కూటమికి అనపర్తి టికెట్ తలనొప్పిగా మారింది. ఈ సీటు విషయంలో అధిష్ఠానం ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం, జనసేన ముందుగా తొలిజాబితా ప్రకటించాయి. తర్వాతే బీజేపీతో పొత్తు కుదిరింది. మొదట్లోనే బీజేపీతో పొత్తుకుదిరినా లేక పొత్తు కుదిరి కేటాయింపులు జరిగిన తర్వాతే అభ్యర్థులను ప్రకటించినా మరోలా ఉండేది. సీటు ప్రకటించిన తరువాత అదే సీటు కావాలనడంతో సమస్య వచ్చిపడింది. గతంలో రూరల్ సీటు విషయంలో టీడీపీ- జనసేన మధ్య కొంత సమస్య ఏర్పడింది. దానిని జాగ్రత్తగా పరిష్కరించి ఊపిరి పీల్చుకున్న తెలుగుదేశం, జనసేన అధిష్ఠానాలకు ఇవాళ బీజేపీ ఒక సీటును అడగడం సమస్యగా మారింది. లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే అసెంబ్లీ అభ్యర్థుల జాబితా కూడా ప్రకటించాల్సి ఉంది. కానీ బీజేపీలో కొందరు సీనియర్లు అనపర్తి లేదంటే జిల్లాలో మరో చోట కేటాయించాలని పట్టుపడుతున్నట్టు సమాచారం. ఇక్కడ ఎంపీ సీటు బీజేపీకి కేటాయించిన తర్వాత మరొక చోట అసెంబ్లీ సీటు తీసుకుంటే బావుంటుందని టీడీపీ,జనసేన వర్గాలు భావిస్తుంటే జిల్లాలోనే కావాలని బీజేపీ పట్టుపడుతుండడం తలనొప్పిగా తయారైంది. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల ప్రకటన ఆలస్యమవుతూ వస్తోంది.బహుశా బుధవారం బీజేపీ జాబితా ప్రకటించకపోతే రెండు రోజుల సమయం పడుతుందనే వాదన ఉంది. ఈ బీజేపీ టికెట్ తేలకపోవడంతో జిల్లాలో ప్రచారం ఊపందుకోవాల్సిన సమయంలో కేడర్ ఆందోళన చెందే పరిస్థితులు నెలకొన్నాయి. రేపో మాపో ఈ సమస్యకు తెరపడితే, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇక యుద్ధానికి సిద్ధమైనట్టే.

నల్లమిల్లికి.. న్యాయం చేయండి

భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు

అనపర్తి/కోరుకొండ, మార్చి 26 : అనపర్తి సీటుపై టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని మంగళవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళా నేతలు కోరారు. నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్న భువనేశ్వరిని అనపర్తి మహిళా నేతలు కలిశారు.అనపర్తి సీటును బీజేపీకి కేటాయిస్తున్నారన్న వార్తలతో తామంతా ఆందోళన చెందుతున్నామని అనపర్తిలో బీజేపీకి బలం లేనందుకు రేపు సీటు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి నల్లమిల్లికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. భువనేశ్వరి మాట్లాడుతూ తాను సీట్ల విషయంలో జోక్యం చేసుకోలేదని అయితే రామకృష్ణారెడ్డి చేసిన పోరాటాలు తనకు తెలుసునని నల్లమిల్లికి అన్యాయం జరగదని.. తాను చంద్రబాబుతో మాట్లాడతానని ఎవరూ కంగారు పడవద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ నేతలు కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, కర్రి సత్యగౌరి, వనుము మల్లేశ్వరి, ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణి, నాయకులు, జుత్తుగ కృష్ణ, కర్రి వెంకటరామారెడ్డి,తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా పత్రాలతో మూకుమ్మడిగా టీడీపీ నాయకులు

అనపర్తిలో టీడీపీ పదవులకు 47 మంది రాజీనామా

అనపర్తి, మార్చి 26 : అనపర్తి సీటుపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నప్పటికీ స్పందన రాకపోవడంతో మంగళ వారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని జిల్లా రాష్ట్ర పార్టీ పదవులు పొందిన 47 మంది నాయకులు తమ పదవు లకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు కర్రి శేషారత్నానికి అందజేసి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపాలని సూచించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో సమావేశమైన నియోజకవర్గ నాయ కులు రాజీనామాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నాయకురాలు కర్రి శేషారత్నం మాట్లాడుతూ అనపర్తి సీటు మార్పు చేస్తున్నారన్న వార్తలపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వక పోవడంపై తామంతా ఆందోళన చెందామని అందుకే తమ జిల్లా రాష్ట్ర పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేశామన్నారు. అనపర్తి టికెట్‌పై స్పష్టత ఇచ్చి నల్లమిల్లిని అభ్యర్థిగా కొనసాగిస్తే రాజీనామాలను ఉప సంహరించు కుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి,మామిడిశెట్టి శ్రీను, తేనెల శ్రీనివాస్, చౌదరి, కర్రి శేషారత్నం, వనుము మల్లేశ్వరి, జుత్తుగ సూర్యకుమారి, ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణి,కర్రి సత్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం,మార్చి26(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. ఎన్‌కోర్ నోడల్ అధికారులు, ఇతర అనుబంధ అధికారులతో మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో సువిధా అంశంపై మంగళవారం సమీక్షించారు. వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సువిధా యాప్ ద్వారా ప్రచార అనుతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని పార్టీలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రచార సభల నిర్వహణకు సమాన అవకాశాలు ఉండే విధంగా అనుమతులు జారీ చేస్తామన్నారు. అనుమతుల విషయంలో సంబంధిత అధికారులంతా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.సమావేశంలో ఎస్పీ పి.జగదీష్, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, నోడల్ అధికారులు ఎ.ముఖలింగం, పీఎం సత్యవేణి, డీఎస్పీ కె.శ్రీనివాసులు, జిల్లా అగ్నిమాపక అధికారి సిహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, రవాణా అధికారి సిహెచ్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టు పెడితే జైలుకే: ఎస్పీ

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై మరింత నిఘా పెట్టామని ఎస్పీ జగదీశ్ తెలిపారు. ప్రతి పోస్టుకూ గ్రూప్ అడ్మిన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతి సభ్యుడూ గ్రూప్ అడ్మిన్‌కి తెలిసి ఉండాలన్నారు. ఎవరైనా సభ్యుడు అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడం, షేర్లు చేయడం చేస్తే వెంటనే గ్రూపు నుంచి తొలగించక పోతే అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అడ్మిన్ వివాదాస్పద పోస్టు పెడితే ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయన ఒక పోస్టర్‌ని ఆవిష్కరించారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

దరఖాస్తు 48 గంటల ముందే చేయాలి

ఒక రూట్‌లో ఒక పార్టీకి, లేదా ఒక అభ్యర్థికి అనుమతి ఇస్తే అదే రూట్‌లో అదే సమయంలో వేరేవారికి అనుమతి ఇచ్చే అవకాశం ఉండదు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ప్రజల దృక్కోణంలో అభ్యంతరకరమని తేలితే ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే అనుమతిని రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. సభలు,సమావేశాలు, మైక్ ప్రచారం నిమిత్తం నిర్ణీత రుసుము చెల్లించాలి. ఫార్మాట్‌కు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రచార సమయంలో ఎంత మంది పాల్గొంటారు.. ఎన్ని వాహనాలు ఉంటాయో వివరాలు అందజేయాలి. ప్రచా రానికి వినియోగించే వాహనాలు, రికార్డులు ఆర్టీవో ద్వారా నిర్ధారణ చేసుకోవాలి.ఇంటింటికీ ప్రచారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే చేయాలి. కరపత్రాలు పంపిణీ చేస్తుంటే వాటిపై ప్రచురణకర్త పేరు, ముద్రించిన కాపీల సంఖ్య ఉండాలి. ఏదైనా దరఖాస్తు తిరస్కరిస్తే .. అభ్యంతరాలు సరిచేసుకుని మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. అనుమతులకు 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. సువిధా పోర్టల్‌లో సమాచారం అందుబాటులో ఉంటుంది.

కోమలి రియల్ ఎస్టేట్ వ్యాపారికి మూడేళ్ల జైలు

అధిక రాబడి ఆశ చూపి మోసం

దేవరపల్లి పాఠశాలలో గ్యాస్ లీక్ స్వల్ప అగ్నిప్రమాదం

- వంట చేస్తుండగా మంటలు
- వెంటనే అదుపు చేసిన సిబ్బంది

7

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేఎస్ జవహర్



మాజీ మంత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కెఎస్ జవహర్‌ను టీడీపీ అధిష్ఠానం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఇంత వరకూ లోకేశ్ ఒక్కరే జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. అయితే జవహర్‌కు ఆ స్థానం కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఉపాధ్యాయ వృత్తి నుంచి ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. -7లో

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జవహర్



కొవ్వూరు, మార్చి 26: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జవహర్ నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరిపారు. జవహర్ మాట్లాడుతూ పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణ, రాష్ట్రాధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్‌ను గుర్తించి 2014లో టీడీపీ కొవ్వూరు నుంచి నిలబెట్టిన సంగతి తెలిసిందే. అపుడు గెలిచి మంత్రి కూడా అయ్యారు. ఎన్నికల ముందు ఆయన సేవలు ఉపయోగించుకోవాలని అధిష్ఠానం భావించినట్టుంది. ఆయనకు ఏకంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టింది.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం



కొత్తపేట, మార్చి 26: టీడీపీ పొలిట్‌బ్యూ రో సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డి సుబ్రహ్మణ్యం గతంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా చేశారు. ప్రస్తుతం రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యా నికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ముదునూరి



ప్రత్తిపాడు, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరంనకు చెందిన ముదునూరి మురళీకృష్ణంరాజు నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా ఉన్న మురళీకృష్ణంరాజును తాజాగా రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమించడం పట్ల నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మురళీరాజుకు పదవి రావడంపై జిల్లాలోని పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వాసిరెడ్డి ఏసుదాసు



సర్పవరం జంక్షన్, మార్చి 26: తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా కాకినాడరూరల్ మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసును నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం విడుదలచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు పదవి అప్పగించిన చంద్రబాబు, అచ్చెన్నాయుడుతో పాటూ ఇతర నాయకులకు ఏసుదాసు కృతజ్ఞతలు తెలిపారు. పంతం నానాజీ విజయంతోపాటూ జిల్లాలో అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు ఏసుదాసును అభినందించారు.

రాజమహేంద్రవరంలో విజిలెన్స్ సోదాలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టి.నగర్‌లో ఉన్న లక్ష్మీ గణేశ్ మిల్క్ డెయిరీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాలతో సిబ్బంది సోదాలు చేశారు. ఒక వెన్న, రెండు నెయ్యి నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పంపించారు. ధ్రువీకరణ లేని తక్కెడ, 5కిలోల పెరుగు బకెట్లపై వినియోగదారుల సంరక్షణ వివరాలు లేకపోవడం, వాణిజ్య అవసరాలకు గృహవినియోగ సిలిండర్లు వాడుతుండడం గుర్తించి కేసులు నమోదు చేశారు. సోదాల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా... కొంగొత్తగా

● సార్వత్రిక ఎన్నికలకు నూతన పద్ధతులు

పెద్దాపురం, మార్చి 26 : కొత్తగా..కొంగొత్తగా 2024 సార్వత్రిక ఎన్నికలకు నూతన పద్ధతుల్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆచరణలోకి తీసుకురాబోతోంది. పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడంతోపాటు యువ ఓటర్లందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రోత్స హించడం, ఎన్నికల సందర్భంగా జరిగే అక్రమాలను నిలువరించేందుకు పటిష్ఠచర్యలు తీసుకుంటోంది. తొలిసారి 85 ఏళ్లపైబడి మంచం కదల్లేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు.

యూత్ పోలింగ్ కేంద్రం..

యువ ఓటర్లు ఎక్కువమంది ఉన్న ప్రాంతాలను గుర్తించి యు వకుల కోసమే ప్రత్యేకంగా నియోజకవర్గానికి ఒకటిచొప్పున పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈకేంద్రంలో పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కూడా యువకులే ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. యువఓటర్లను పోలింగ్ కేంద్రాలవైపు నడిపించే లా వారిని ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మహిళలు, దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు వారి కోసమే ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈసారి యువ ఓటర్లపై ఈసీ గురిపెట్టింది.

ఇంటివద్దే ఓటుహక్కు..

2019 సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ ఓటర్లు అందరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. ఈసారి 85 ఏళ్లు పైబడి మంచంపై నుంచి కదల్లేని స్థితిలో ఉన్నవారు, దివ్యాంగు లకు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఫారం 16డీ ద్వారా కల్పించనున్నారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల అధికారులు పరిశీలించి అవకాశం ఇవ్వను న్నారు.

పోలింగ్ కేంద్రం ఎక్కడో తెలుసుకోవచ్చు..

గత ఎన్నికల్లో జిల్లాలో 80శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి 95శాతానికి పైబడి నమోదయ్యేలా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నారు. ఓటర్లకు తమ ఓటు ఎక్కడుందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారని ఎన్నికల సంఘం గుర్తించింది. ఈనేప థ్యంలో మై ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈయాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని ఓటరు ఎపిక్ కార్డు నంబరు నమోదుచేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటువేసే అవకాశం ఉందనే వివరాల్ని ఇట్టే తెలిసిపోతాయి. ఫోన్ అనుసంధానిత ఐచ్ఛికాన్ని దీనికి ప్రత్యేకంగా ఇచ్చారు.



ప్రతి పైసాకు లెక్క.

ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయానికి సంబంధించి ప్రతీ పైసాకు ఈసారి లెక్క ఉండబోతోంది. తొలిసారి నియోజకవర్గానికి ఒక అకౌం టింగ్ బృందాన్ని ఏర్పాటుచేశారు. గతంలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తాము చేసిన వ్యయానికి సంబంధించిన వివరాలన్నీ ఎన్నికల వ్యయ పరిశీలకులకు 15 రోజులకు ఒకసారి సమర్పించాల్సి ఉండేది. ప్రస్తుతం ప్రచారంతోపాటు ఇతరత్రా కార్యక్రమాలకు చేస్తు న్న వ్యయాన్ని పరోక్షంగా అకౌంటింగ్ బృందాలు పరిశీలించనున్నాయి.

పలు రైళ్లు రద్దు, పలు రైళ్లు దారి మళ్లింపు

సామర్లకోట, మార్చి 26: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ట్రాక్ పనుల దృష్ట్యా ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ విజయవాడ-విశాఖల మధ్య సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు, మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూప్‌కర్ మంగళవారంరాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారికి లేఖ పంపారు. ఈ మేరకు ఆ సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది. 22701 నంబరు గల గుంటూరు-విశాఖల మధ్య, 22702నంబరు గల విశాఖ-గుంటూరుల మధ్య, 17219 నంబరు గల మచిలీపట్నం-విశాఖల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లను ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 28 వరకూ రద్దు చేశారు. 17220 నంబరు గల విశాఖ-మచిలీపట్నంల మధ్య నడిచే రైలు ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 29 వరకూ రద్దు చేశారు.

మరికొన్నిరైళ్ల దారి మళ్లింపు

13351 నంబరు గల ధన్‌బాద్-అలపూజ మధ్య రాకపోకలు సాగించే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 1 నుంచి 28వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. 12835 నంబరు గల హతియా-బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. 18637 నంబరు గల హతియా-బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 22837 నంబరు గల హటియా-ఎర్నాకుళంల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 18111 నంబరు గల టాటా-యశ్వంత్‌పూర్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 4, 11, 18, 25 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 12376 నంబరు గల జాసిడ్-తాంబరమ్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 12509 నంబరు గల బెంగుళూరు-గౌహతిల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. 11019 నంబరు ముంబాయి-భువనేశ్వర్‌ల మధ్య రాకపోకలు సాగించే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీలలో విజయవాడ,గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. 12889 నంబరు గల టాటా-ఎస్ఎంవీ బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 22643 నంబరు గల ఎర్నాకుళం-పాట్నాల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 12, 8, 15, 22 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరంల మీదుగా నిడదవోలు చేరుతుంది. 12756 నంబరు గల భావనగర్-కాకినాడ పోర్టుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరంల మీదుగా నిడదవోలు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీపంలో గల రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయ సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూప్‌కర్ తెలిపారు.

జనసేన నాయకుడికి ఎస్ఐకి మధ్య వివాదం

● పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ముమ్మిడివరం, మార్చి 26: భూ తగాదా విషయంలో పోలీసుస్టేషన్‌కు వెళ్లిన జనసేన నాయకుడి పట్ల ఎస్ఐ దౌర్జన్యంగా ప్రవర్తించిన తీరుపై ముమ్మిడివరంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భూ తగాదా విషయంలో లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన ఇరువర్గాల వారిని ఎస్ఐ బి.సురేష్‌బాబు మంగళవారం పోలీసుస్టేషన్‌కు పిలిపించి ఇరువర్గాలకు చెందినవారిని కూర్చోబెట్టారు. జనసేన పార్టీ నాయకుడు గోదశి పుండరీష్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఆ భూ వివాదం గురించి మాట్లాడుతుండగా ఎస్ఐ ఏకవచనంతో మాట్లాడి దురుసుగా ప్రవర్తించడంతో పుండరీష్‌కు, ఎస్ఐకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విషయం బయటికి రావడంతో జనసేన, టీడీపీ నాయకులు, ఓ సామాజికవర్గానికి చెందిన యువత పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి ఆందోళనకు దిగారు. ఎస్ఐకు వ్యతిరేకంగా నినాదాలుచేసి ఎస్ఐ దౌర్జన్యం నశించాలని రోడ్డుపై బైఠాయించారు. దీంతో సీఐ ఎన్.కొండయ్య అక్కడకు చేరుకుని బాధితుడు పుండరీష్‌ను ఎస్ఐ సురేష్‌బాబును, నాయకులతో మాట్లాడి జరిగిన విషయంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనకారులు గుమిగూడి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో వారందరికీ సీఐ నచ్చజెప్పి బుధవారం మరోసారి చర్చించి వాస్తవాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని సీఐ వారికి హామీఇచ్చి పంపించి వేశారు. నాయకులు తాడి నరసింహారావు, చెల్లి అశోక్, దాట్ల పృథ్విరాజ్, గుద్దటి జమి, దేశంశెట్టి గోపి, తోలేటి రాంబాబు, పోలిశెట్టి బాబి, నూకల దుర్గలతోపాటు పలువురు చర్చలు జరిపిన వారిలో ఉన్నారు. పుండరీష్ ఎవరో తెలి యక అలా మాట్లాడానని ఎస్ఐ సురేష్‌బాబు సంజాయిషీ ఇచ్చినప్పటికీ పుండరీష్ సంతృప్తి చెందలేదు.



ముమ్మిడివరంలో రాస్తారోకో చేస్తున్న యువకులు

ఇద్దరు ఇంటి దొంగల సస్పెన్షన్

● టేకు చెట్ల గల్లంతు బాగోతంలో ప్రాథమిక చర్యలు
● మరికొందరిపై చర్యలకు రంగం సిద్ధం
● డివిజన్‌స్థాయి నుంచి బీట్ స్థాయి వరకు జల్లెడపట్టే పనిలో దర్యాప్తు బృందాలు

రంపచోడవరం, మార్చి 26: రంపచోడవరం అటవీశాఖ డివిజన్ పరిధిలో రంపచోడవరం, మారేడుమిల్లి రేంజ్‌ల పరిధిలో టేక్ ప్లాంటేషన్లలో 400కుపైగా టేకు చెట్లను నరికేసిన అక్రమ భాగోతంలో ఒక డిప్యూటీ రేంజ్ అధికారిని, మరొక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఈ పై ఇద్దరి పాత్ర ఆధారాలతో రుజువు కావడంతో వారిపై తక్షణ చర్యలు తీసుకున్నారు. ఇదే భాగోతంలో మరి కొందరిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా సమగ్ర దర్యాప్తును రాజమహేంద్రవరంలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ పర్యవేక్షణలో ఆరు బృందాలను నియమించించిన సంగతి తెలిసిందే. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డివిజన్‌స్థాయి నుంచి బీట్ స్థాయి వరకు అందరి అధికారులు తమ సిబ్బంది సెల్‌ఫోన్లను కూడా జల్లెడపట్టే పనిలో దర్యాప్తు బృందాలు నిమగ్నమయ్యాయి.



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అన్నవరం సత్యదేవుడి హుండీల ఆదాయం రూ. 1.01 కోట్లు

అన్నవరం, మార్చి 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,01,55,528 నగదు, 12 గ్రాముల బంగారం, 522 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 41 డాలర్లు, సింగపూర్ 12, మలేషియా 11 డాలర్లు సమకూరాయి. లెక్కింపును ఈవో రామచంద్ర మోహన్, ఛైర్మన్ రోహిత్, డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పర్యవేక్షించగా సిబ్బంది, వ్రతపురోహితులు, నాయీబ్రాహ్మణులు లెక్కింపులో పాల్గొన్నారు. 20 రోజులకు ఈ ఆదాయం లభించగా రోజుకు స్వామి వారి హుండీలలో రూ. 5.07 లక్షలను భక్తులు సమర్పించుకున్నారు.

అంతర్వేది స్వామివారి ఆదాయం రూ.16,49,294



అంతర్వేదిలో స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది, మార్చి 26: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 29 రోజులకుగాను స్వామివారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ప్రధాన ఆలయం, గుర్రాలక్కమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.16,12,175, అన్నదాన హుండీ ద్వారా రూ.37,119, మొత్తం హుండీల ఆదాయం రూ.16,49,294 వచ్చింది. అలాగే స్వామివారి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.15,491 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏసీ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.5.63లక్షలు

సర్పవరం జంక్షన్, మార్చి 26: మాఘమాసంలో సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి భక్తులు వివిధ కానుకల రూపంలో శ్రీవారి హుండీలో వేసిన నగదును లెక్కించగా రూ.5,63,490లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. మంగళవారం సర్పవరంలో శ్రీభావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ,ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో స్వామివారి హుండీలో వేసిన నగదును భక్తుల సమక్షంలో లెక్కించారు. మాఘమాసం నెల రోజులపాటు నిర్వహించిన మాఘమాస తిరునాళ్లకు శ్రీభావనారాయణ స్వామిని దర్శించుకున్న భక్తులద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

కాకినాడ రూరల్, మార్చి 26: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి మహాలక్ష్మినగర్‌కు చెందిన ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగి ంది. ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మహత్య చేసుకున్న బాలిక తరచూ వేరే యువకుడితో ఫోన్‌లో మాట్లాడేదని అది తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించగా మనస్తాపానికి గురైన బాలిక వారి ఇంటి పైఅంతస్తులోని గదిలోగల సీలింగ్ ఫ్యాన్‌కు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే వైద్యం నిమిత్తం తల్లిదండ్రులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవానం ఉదయం చనిపోయిందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి బాలిక మృతి

కొత్తపల్లి, మార్చి26: మాట వినడంలేదని తల్లి మందలించిన సంఘటనలో బాలిక గడ్డి మందు తాగి మృతి చెందిందని మంగళవారం కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన బండి మణి చంద్రికను ఆమె తల్లి ఇంటివద్ద మాట వినకుండా ఏపనిచేయడంలేదని ఈనెల 19న మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బాలిక గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరింది. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు తొలుత పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం అవసరం కావడంతో వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం బాలిక మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



మృతిచెందిన ఉపాధ్యాయుడు సాంబయ్య

కూనవరం,మార్చి26: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అల్లూరి జిల్లా కూనవరం మండలం నరసింగపేటగ్రామానికి చెందిన సోయం సాంబయ్య టేకుబాక గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భీమవరం గ్రామంలో పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో నరసింగపేట-పొట్టాయిగూడెం మధ్యలోసాంబయ్య, అతని స్నేహితుడు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి టాటా వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన సాంబయ్య, స్నేహితుడు రాజును ప్రభుత్వాస్పత్రికి తరలించగా సాంబయ్య మృతి చెందాడు. రాజును మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ శిశువిహార్‌కు మగశిశువు



సర్పవరంజంక్షన్, మార్చి 26: కాకినాడ జీజీహెచ్‌లో 10 రోజుల చికిత్స అనంతరం ఆరోగ్యంగా కోలుకున్న మగ శిశువును అశోక్‌నగర్‌లో గల శిశువిహార్ సెంటర్‌లో ఉంచినట్లు ఐసీడీఎస్ పీడీ కె. ప్రవీణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో తెల్లటి గుడ్డలో చుట్టిన మగశిశువును బోట్‌క్లబ్ ప్రవేశద్వారం వద్ద వదిలేసి ఉండటం, శిశువు ఏడుపు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి 108 సాయంతో జీజీహెచ్‌లో ఎస్ఐసీయూలో ఉంచిన వైద్యులు శిశువుకు వైద్య చికిత్సలు అందించారు. సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. చిన్నారి ఆరోగ్యసంరక్ష కోసం శిశువిహార్‌లో ఉంచామని, ఈ బాబు కోసం సంబంధిత తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు 30 రోజుల్లో తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని కోరారు. ఎవరూ రాని పక్షంలో చట్టబద్ధంగా బాబును దత్తత ఇస్తామన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అధిక సొమ్ము రాబడి ఉంటుందని ఆశజూపి మోసం చేసిన కేసులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంనకు చెందిన కాకర్ల శ్రీనివాసచౌదరి... కోమలి రియల్ ఎస్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తుంటాడు. రాజమహేంద్రవరం టి.నగర్‌లో ఓ కార్యాలయం తెరిచాడు. తణుకులో వెంచర్లు వేశామని పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని పలువురిని నమ్మించాడు. రూ.10 వేలు కడితే రోజుకు రూ.300 చొప్పున 300రోజుల్లో మూడు రెట్లు అధికంగా పొందవచ్చని ఆశజూపాడు. వలలో పడిన కొందరికి రశీదులు కూడా ఇచ్చాడు. అయితే తర్వాత ముఖం చాటేశాడు. దీంతో 35 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావుకు మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్సు జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ తీర్పు చెప్పారు. నేరస్తుడికి త్వరితగతిన శిక్ష పడడంలో చొరవచూపిన డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ శ్రీనివాస రావు, పీపీ ఎంఏ బాషా, హెచ్‌సీ సీహెచ్ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

శ్రీరామజన్మభూమి మినియేచర్ పత్రం విడుదల

అమలాపురం టౌన్, మార్చి 26: అయోధ్యలో ప్రారంభించిన శ్రీరామ జన్మభూమి ఆలయంపై భారత తపాలా శాఖ ఆరు తపాలా బిళ్లలతో కూడిన మినియేచర్ పత్రాన్ని విడుదల చేసింది. తపాలా బిళ్లల ముఖ విలువ ఒక్కొక్కటీ రూ.5 కాగా మినియేచర్ పత్రానికి రూ.100గా నిర్ధారించారు. ఈమినియేచర్ పత్రాన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన తపాలా బిళ్లల సేకరణ కర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు.



పది పరీక్షకు వెళుతుండగా తండ్రి మరణవార్త

● పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసిన టెన్త్ విద్యార్థి





తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న చరణ్

రాజవొమ్మంగి మార్చి 26: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన పరిశిక చరణ్ ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఇంటి నుంచి రాజవొమ్మంగిలోని పరీక్షా కేంద్రానికి వచ్చిన చరణ్‌కు తన తండ్రి చనిపోయాడనే విషయం తెలిసింది. అందరూ ఇంటికి వెళ్లిపొమ్మన్నారు. తండ్రి మరణంతో దుఃఖంలో ఉన్న చరణ్ పరీక్ష రాసే వెళ్తానని చెప్పి, పరీక్ష త్వరగా రాసి ఇంటికి వెళ్లి తన తండ్రి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం చరణ్ తండ్రి బాలరాజు జీడిమామిడి తోటకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై పడిపోవడంతో గ్రామస్థులు ఇంటికి తీసుకుని వచ్చారు. మంగళవారం ఉదయం పదో తరగతి పరీక్ష రాసేందుకు చరణ్ రాజవొమ్మంగి వచ్చే సరికి పలువురి ద్వారా తన తండ్రి మరణవార్త తెలుసుకున్నాడు. దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్ష రాశాడు. పరీక్ష అనంతరం తన సోదరుడు హర్షవర్ధన్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించాడు.

దేవరపల్లి పాఠశాలలో స్వల్ప అగ్నిప్రమాదం

● వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు.. అదుపు చేసిన సిబ్బంది

దేవరపల్లి, మార్చి 26: దేవరపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం చేసే సందర్భంలో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించిందని ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయన్నారు. వెంటనే హెల్పర్స్ గమనించి ఉపాధ్యాయుల సాయంతో ఫైర్ ఎక్స్టింగ్ మిషన్ ద్వారా మంటలను అదుపు చేశారన్నారు. అయితే సదరు మిషన్ ద్వారా వచ్చిన వాయువు వల్ల ఆహార పదార్థాలు తినడానికి పనికి రాకుండా పోయాయని, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులు కూడా పాడయ్యాయన్నారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామన్నారు. కాగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యామ్నయ పద్ధతిలో అందించామన్నారు. ఈ సంఘటన వల్ల రూ.10 వేల వరకు నష్టం జరిగినట్టు తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి



గోదావరిలో మునిగి మృతిచెందిన శివశంకర్ మృతదేహంవద్ద రోధిస్తున్న బంధువులు

సీతానగరం, మార్చి 26: గోదావరిలో మునిగి యువకుడు మృతి చెందిన విషాద సంఘటన ముగ్గుళ్ల గ్రామంలో జరిగింది. పశ్చిమగోదావరిజిల్లా పోలవరం గ్రామానికి చెందిన గోపల శివశంకర్ కుటుంబం రఘుదేవపురంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఉంటోంది. మంగళవారం ఉదయం శివశంకర్ (21) తన స్నేహితులతో కలసి ముగ్గుళ్లలోని గోదావరిలో స్నానానికి వెళ్లాడు. స్నేహితులు ముగ్గురు ఒడ్డున స్నానం చేస్తుండగా శివ శంకర్ కొంతమేర లోపలికి వెళ్లగా మునిగిపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ సమర్పణరావు, సిబ్బంది సంఘనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం సుమారు 5గం.లకు మృతదేహం లభ్యమైంది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమర్పణరావు తెలిపారు. ఈఘటనతో రఘుదేవపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమా రుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విల పిస్తున్నా రు. గోదావరిలో నిబంధనలు అతిక్రమించి లోతుగా ఇసుక తవ్వకాలు జరిగాయని, ఆ గోతులవల్ల మునిగిపోయినట్టు తెలుస్తోంది.

రాష్ట్రానికి బీజేపీ అన్యాయం : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26: రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేశాయని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో మంగళవారం నగర కార్యదర్శి కొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని, మానవత్వాన్ని మంటగలుపుతున్న బీజేపీని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు కె.జ్యోతిరాజు, చింతలపూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

వంతలకే టీడీపీ టికెట్ ఇవ్వాలి

● మద్దతుగా రంపచోడవరంలో సమావేశం



వంతలకు టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్న నాయకులు

రంపచోడవరం, మార్చి 26: రంపచోడవరం తెలుగుదేశం పార్టీ టికెట్‌ను వంతల రాజేశ్వరికే ఇవ్వాలని రంపచోడవరం మండలానికి చెందిన పలువురు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు పంచాయతీల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఈ సమావేశం జరిగింది. రాజేశ్వరికి టికెట్ ఇచ్చే విషయంలో అధిష్టానం పునరాలోచించాలని వారు డిమాండ్ చేశారు. సింహాచలందొర, వై.నిరంజనీదేవి, ముర్రం లక్ష్మి, కూరా రమణమ్మ, దారా వెంకట్రావు, వంతల అచ్చియమ్మ, కె.ఫణికుమార్, కంగల అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

వంతల వెనకే కేడర్ అంతా



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దేవీపట్నం, మార్చి 26: టీడీపీ రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి వెనుకే కేడర్ అంతా ఉందని దేవీపట్నం టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ముచ్చు త్రిమూర్తులు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ముచ్చు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ టికెట్ మార్పు చేయాలన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన రాజేశ్వరిని కాదని కనీసం గుర్తింపులేని మిరియాల శిరీషకు టికెట్ ఇవ్వడం తీవ్ర విస్మయానికి గురయ్యామన్నారు. ఈవిషయంపై చివరిగా అధిష్టానం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో జంజ్యం సత్యనగేష్, గోళ్ల చంటిబాబు, కారం పోశమ్మ, లంక హరిబాబు, పల్లపాటి నాగేశ్వరరావు, జొన్నల రాంబాబు, కందికొండ గౌరీశ్వరి, శివపార్వతి, జమ్మి కవిత, యజ్ఞవతి, డొక్కా వీర్రాజు, కె.శ్రీధర్, టి.రాంబాబు, ఎ.వీరబాబు, మద్దేటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థులను ఓడించండి

కూనవరం, మార్చి 26 : ఐదేళ్లుగా అధికారంలో ఉండి పోలవరం నిర్వాసితులకు అన్ని రంగాల్లో ఇబ్బందులు కలుగజేసిన వైసీపీ అభ్యర్థులను ఓడించాలని సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో ప్రజలకు ఎటువంటి సాయం అందించలేదన్నారు. నిర్వాసితుల సమస్యలు గాలికొదిలేసి పాలన సాగించారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ అభ్యర్థులను ఓడించి నిర్వాసితులకు అండగా నిలిచిన సీపీఎం నాయకులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొమరం పెంటయ్య, రామకృష్ణ, నానుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపల్లి గీత ఎంపిక పట్ల హర్షం

ఎటపాక, మార్చి26 : టీడీపీ-జనసేన, బీజేపీ కూటమి అరకు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత ఎంపిక పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గన్నవరం గ్రామంలో బీజేపీ నాయకులు, కర్తకర్తలు సమావేశం నిర్వహించారు. అరకు ఎంపీ అభ్యర్థిగా గీత విజయం సాధిస్తారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు బొల్లా ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఎం.పెరమయ్య, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చింతా దుర్గారావు, ములకపల్లి రామకృష్ణ, జయమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం, సభల నిర్వహణకు అనుమతి పొందాలి

● సబ్ కలెక్టరు, ఏఎస్పీ



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు, ఏఎస్పీ

రంపచోడవరం, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికలు వివిధ పార్టీల నాయకులు ప్రచారాలు, సభలకు తప్పనిసరిగా రిటర్నింగ్ అధికారితో అనుమతులు పొందాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లి తెలిపారు. మంగళవారం వారు ఏడు మండలలాల రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు పాటించాల్సిన విధివిధానాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన పీవో



పరీక్షా కేంద్రాన్ని పరిశీస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మార్చి 26: స్థానిక గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో తాగునీరు, లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యువో రామతులసి తదితరులు పాల్గొన్నారు.

సీతపల్లిలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



రంపచోడవరం, మార్చి 26: మండలంలోని సీతపల్లి గ్రామంలో మంగళవారం ఉపాధ్యాయుడు కలుం వీర్రాజు, భారతి దంపతులు సహాయంతో 11 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గిరిజన సాంప్రదాయం ప్రకారం పూజారులు పల్లాల ఈశ్వర్‌రెడ్డి, గూట్టేటి కృష్ణారెడ్డి చేతుల మీదుగా హోమం జరిపించారు. గ్రామస్తులు ఆంజనేయునికి 101 బిందెలతో జలాభిషేకం చేసి కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసంతర్పణ చేశారు. ఎస్ ఎస్‌ఎఫ్ జిల్లా సంయోజక్ గుడ్ల శ్రీనివాసరెడ్డి, ప్రచాకర్ కారం చెల్లన్నదొర, పాల్గొన్నారు.

ఐదు రోజులుగా నీటికి కటకట

వై.రామవరం, మార్చి 26: మండల కేంద్రమైన వై.రామవరంలో గత ఐదురోజులుగా తాగునీటికి తీవ్ర ఎద్దడి నెలకొంది. స్థానిక గ్రంథాలయంవద్ద ఉన్న మంచినీటి ట్యాంక్ మరమ్మతులకు గురవడంతో గ్రామస్తులకు నీళ్లకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్యాంక్ వద్ద వాల్వ్, మోటారు మరమ్మతుకు గురవడంతో నీళ్ల కోసం గ్రామస్తులు పరుగులు తీస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగతినే మరమ్మతులు చేపట్టి నీటిఎద్దడి నివారించాలని కోరుతున్నారు.

'నాటు తుపాకులు పోలీస్‌స్టేషన్లో అందజేయాలి '

మోతుగూడెం, మార్చి 26: జిల్లా ఎస్పీ శ్రీ తూహిన్‌సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహూల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాలతో డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మర్రిగూడెం గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ జంతువులను వేటాడే నాటు తుపాకులు ఎవరిదగ్గర ఉన్నా పోలీస్‌స్టేషన్లో వెంటనే సరెండర్ చేయాలన్నారు. నాటు తుపాకులు సరెండర్ చేసిన వారికి నగదు బహుమతి అందిస్తామన్నారు. జిల్లాలో చాలామంది నాటు తుపాకులు సరెండర్ చేస్తున్నారని, వారికి నగదు బహుమతి కూడా ఇచ్చారన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్‌లు అందించి చిన్న పిల్లలకు స్వీట్లు పంచారు.



గ్రామస్తులకు అవగాహన కలల్పిస్తున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

▸ క్షేత్రస్థాయిలో పర్యటించే బృందాలదే కీలక బాధ్యత

▸ రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో తేజ్‌భరత్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్వో తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 26: స్వాత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల మోడల్ ప్రవర్తనా నియమావళి అమలు విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించే బృందాలదే కీలక బాధ్యత అని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ అన్నారు. మంగళవారం ఎన్నికల విధులు నిర్వహించే బృందాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలపై ఎంతో గురుతరమైన బాధ్యత వుందన్నారు. సువిధ యాప్‌లో వివిధ సభలు సమావేశాలు, ప్రచారం, ప్రచురణల కోసం అనుమతులు నిష్పక్షపాతంగా ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. 48 గంటల ముందు అనుమతి తప్పనిసరి అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే బృందాలు తనిఖీలు నిర్వహించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో సహాయ ఆర్‌వో వైకేవీ అప్పారావు, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, పంచాయతీరాజ్, బొమ్మూరు సీఐ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలి : సిటీ ఆర్వో

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని అన్ని బృందాలను రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఆర్‌వో, కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ప్రవర్తనా నియమావళి పర్యవేక్షించే బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై కేసులు పెట్టాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిపే బాధ్యత నిఘా బృందాలపై ఉందన్నారు. సమావేశంలో డీఎస్పీ సెంట్రల్, అర్బన్ తహశీల్దార్, సిటీ ప్లానర్, డిప్యూటీ తహశీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయం

▸ టీడీపీ-జనసేన-బీజేపీ రాజానగరం అభ్యర్థి బత్తుల

▸ పలుచోట్ల ఆత్మీయ సమావేశాలు

కోరుకొండ, మార్చి26: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని నియోజకవర్గ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని మునగాల, కాపవరం, గుమ్మళూరు, బుచ్చింపేట, మధురపూడి, నిడిగట్ల గ్రామాల్లో మంగళవారం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అసత్య ప్రచారం నమ్మవద్దని, వారి మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. బీవీఆర్ మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పని చేయాలని, అత్యధికమెజార్టీతో ఇటు బలరామకృష్ణను, పురందేశ్వరిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి : శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26: రాజమహేంద్రవరం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు దగ్గుబాటి పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసులను గెలిపించాలని జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 10వ వార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జామి సత్యనారాయణ, దాసరి గురునాథం, చొప్పెల్ల వీరభద్రరావు, ఆసూరి సుధాకర్, షేక్ ఖాన్, షేక్ భాషా, కప్పల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో టీడీపీలోకి చేరిన వారితో ఆదిరెడ్డి వాసు

వైసీపీ నుంచి వంద మంది టీడీపీలో చేరిక

రాజమహేంద్రవరం శేషయ్యమెట్ట, రెడ్డీల పేట, ఆర్యాపురాలకు చెందిన సుమారు 100 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారందరికీ ఆదిరెడ్డి వాసు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, రెడ్డి పార్వతి, రెడ్డి సతీష్ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం



నారా భువనేశ్వరికి మధురపూడిలో స్వాగతం పలుకుతున్న బత్తుల

గోపాలపురం/కోరుకొండ, మార్చి 26: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా రాజమహేం ద్రవరంలోని విమానాశ్రయానికి చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వ రికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గోపాల పురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మంగళ వారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పారు. అనంతరం గోపాలపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆమెకు టీడీపీ శ్రేణులు స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా మద్దిపాటిని ఆమె ఆశీర్వదించారు. తదుపరి ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెం వెళ్లారు. కార్యక్రమంలో గోపాలపురం నుంచి మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్, కొర్లపాటి రాము, జ్యేష్ఠ శ్రీను, వడ్లమూడి రమేష్, శరత్‌బాబు, కూనపం ప్రసాద్‌బాబు, కోరుకొండ నుంచి బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి సీటును టీడీపీకే కొనసాగించాలి

అనపర్తి, మార్చి 26: అనపర్తి అసెంబ్లీ సీటుకు తెలుగుదేశం పార్టీనే కొనసాగించాలని నియోజకవర్గ నాయకులు కోరారు. రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్న నారా భువనేశ్వరిని కలిసేందుకు వెళ్లిన నాయకులు ప్రదర్శించిన ఎంపీగా పురందేశ్వరి గెలుపు అనపర్తిలో నల్లమిల్లితోనే సాధ్యమని ముద్రించిన ఫ్లెక్సీ వద్ద రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి, అనపర్తి నేతలతో కలిసి పాల్గొన్నారు.

ఆర్ట్స్ డిగ్రీ కళాశాలతో ఎస్‌కేవీటీ ఎంవోయూ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26: తెలుగు భాషాభివృద్ధికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగుశాఖతో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఎంఓయూ కుదుర్చుకుందని ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తెలిపారు.ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు సమక్షంలో మంగళవారం ఈ ఎంవోయూ జరిగిందని తెలిపారు. తెలుగుశాఖ అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ఈ ఎంవోయూ అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్నామన్నారు. భాష, సాహిత్య పరిశోధనలో మరింతగా ముందడుగు వేయడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల తెలుగుశాఖాధిపతి పీఏ సత్యనారాయణ, కె.సౌందర్యవతి, శ్రీనివాస్, పల్లి సుధా, శివాజీ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా నిలిపివేయడం దారుణం : వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26: టీడీపీ హయాంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చేవారమని, దానిని జగన్ నిలిపివేయడం అన్యాయమని సిటీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తాడితోట మసీదులో అల్ సమి గ్రూప్ అధినేత అబ్దుల్లా, మైనార్టీ నేత, మాజీ కార్పొరేటర్ రఫిక్ రాజా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, కాశి నవీన్‌కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్, రెడ్డి మణి, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, ముస్లింలు పాల్గొన్నారు.

నీటి వినియోగంలో బాధ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నీటి వినియోగం విష యంలో బాధ్యతతో కూడిన అలవాట్లను అలవరచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎల్ ఎస్ఏలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జల వనరులను కాలుష్యం నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారత రాజ్యాంగంలోని 51ఏ(జీ) అధికరణ ప్రకారం పర్యావరణాన్ని పరిరక్షించడం, మెరుగుపరచడం ప్రతి పౌరుడి బాధ్యతని గుర్తు చేశారు. మరో సెషన్‌లో జరిగిన సమావేశంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల ప్రాముఖ్యత, జారీ గురించి వివరించారు. కార్యక్రమంలో డ్వామా అధికారి ఏ.వెంకటలక్ష్మి, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. బైక్ స్వాధీనం

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మల్లయ్యపేటలో నివాసం ఉంటున్న బైగని రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న టూటౌన్ పోలీసులు.. అతడు దొంగతనం చేసిన మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు దంతాలపై శ్రద్ధ తీసుకోవాలి

బిక్కవోలు, మార్చి 26: విద్యార్థులందరూ దంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అనపర్తి ఏరియా ఆసుపత్రి దంత వైద్యురాలు డాక్టర్ సీహెచ్ భాగ్యలక్ష్మి సూచించారు. ప్రపంచ ఓరల్ హెల్త్ ఉత్సవాల సందర్భంగా ఆమె మంగళవారం బిక్కవోలులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు జరిపారు. ఉదయం, రాత్రి తప్పనిసరిగా దంతాలను శుభ్రపరచుకోవాలన్నారు. ఏప్రిల్ 20 వరకూ ప్రతి మంగళవారం ఈకార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తామన్నారు. ఈమె వెంట బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.దుర్గాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ పూజలు

గోకవరం, మార్చి 26: గోకవరంలో శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, మండప పునఃపూజలు, మన్యు సూక్త హోమం, సుబ్రహ్మణ్య హోమం, ఆవాహిత దేవతా మూలమంత్ర హోమం వైభవంగా జరిగాయి.

టాలెంట్ టెస్ట్‌లో గణేష్‌కు స్టేట్‌ఫస్ట్ ర్యాంక్

రాజానగరం, మార్చి 26: గత నెల 18న నిర్వహించిన గోదావరి టాలెంట్ టెస్ట్-2024లో తమ పాఠశాల విద్యార్థి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు దివ్య విద్యాసంస్థల చైర్మన్ బర్ల సత్యనారాయణ, కరస్పాండెంట్ బర్ల సుబ్బలక్ష్మి మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి గణేష్ గుప్త స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి ఉపాధ్యా యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థి సమూహ ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలి

ఎస్ఐవో నాయకుల వినతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26: విద్యార్థి సమూహ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్ఐవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం సిటీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను కలిసి విన్నవించారు. జాతీయ ,రాష్ట్ర స్థాయిలో విద్య, ఉపాధి, పర్యావరణ , సామాజిక న్యాయాలతో కూడిన మేనిఫెస్టోను వారికి అందించి వాటిని అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహామండలి సభ్యులు జాఫర్ షరీఫ్, రాష్ట్ర పీఆర్ సభ్యుడు నయీం, స్థానిక బాధ్యుడు ఆసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారించొచ్చు

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగుర్రెడ్డి

అనపర్తి, మార్చి 26: చిన్నారుల్లో వచ్చే కంటి రుగ్మతలను ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా నివారించవచ్చని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నారుల్లో కంటి రుగ్మతలపై జిల్లా స్థాయిలో వైద్యులకు శిక్షణా తరగతులను అనపర్తి జీబీఆర్ కళాశాల సెమినార్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమలో గౌతమి వైద్యాలయ నేత్ర వైద్య బృందం వైద్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎమ్‌వో పద్మశ్రీ, డాక్టర్ అశోక్, తరుణ్, శ్రీనివాసవర్మ, చారి, శ్రీరవి, విశ్వనాథ్, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత శిక్షణలో 'ఆర్ట్స్' విద్యార్థి



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన అజయ్‌రావు నాయుడు జాతీయ సమగ్రత శిక్షణ పూర్తి చేశారు. భారతదేశ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకూ జాతీయస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు రాష్ట్రం నుంచి 8 మందిని ఎంపిక చేయగా వీరిలో అజయ్‌రావు నాయుడు ఒకరు కావడం గమనార్హం. ఏడు రోజుల పాటు జరిగిన శిక్షణలో భాగంగా యోగా, ట్రెకింగ్, ఫీల్డ్ విజిట్ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు అజయ్‌రావు నాయుడును కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అభినందించారు.

సాయిబాబా ఆలయంలో కుంభాభిషేక ఉత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 26: ప్రయత్నశీలతకు, పట్టుదలకు క్షీరసాగర మధన ఘట్టం ఒక ప్రతీక అని ప్రవచన బాదరాయణి, శతావధాని తాతా సందీప్‌శర్మ అన్నారు. రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డు ఆనుకొని ఉన్న శ్రీ షిరిడి సాయి మందిరంలో ద్వాదశ వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు ఏవీపీఎస్ రామచంద్రరావు నిర్వహణలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వక్తను సత్కరించారు. అనంతరం పెద్దిపట్ల శైలజ శాస్త్రీయ భక్తి సంగీతంతో అలరించారు.

కడియంలో జిల్లా టాస్క్ ఫోర్స్ టీం పర్యటన



రికార్డులు పరిశీలన చేస్తున్న డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీం

కడియం, మార్చి 26: కడియం పీహెచ్‌సీ పరిధిలో కడియం-2 సచివాలయాన్ని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎంఐఎస్, ఆర్‌సీహెచ్ రక్తహీనత ఉన్న గర్భిణులు, కిశోర్ బాలికలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులను స్వయంగా విచారించారు. ఆరోగ్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. బృందంలో నేషనల్ హెల్త్‌మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి, డిస్ట్రిక్ట్ స్టేటటికల్ ఆఫీసర్ కుమారస్వామి, డీపీహెచ్ ఎన్ వసంతలక్ష్మి ఉన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న, డాక్టర్ ఎస్.నాగసాయి మౌర్య, ఆరోగ్య విస్తరణాధాకారి ఎం.రామకృష్ణ, మహిళా హెల్త్ సూపర్‌వైజర్ జి.కృష్ణకుమారి, ఏఎన్ఎం వై.నిర్మల, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కోదండరామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

కడియం, మార్చి 26: శ్రీకోదండరామస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి నూతన ఆలయ శిలావిగ్రహ, పంచలోహ విగ్రహ, ఆలయ ప్రతిష్ఠ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 28 వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు విశ్వక్సేన ఆరాధన, దీక్షాధారణ, అకల్మషహోమం, 108 కలశాలతో గ్రామోత్సవం, విష్ణుసహస్రనామ పారాయణ, యాగశాల ప్రవేశం, వాస్తు హోమం, గరుడ ప్రతిష్ఠ, హారతి వైభవంగా జరిగాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కడియం, మార్చి 26: ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై వేమగిరిలో మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ర్యాలీ నిర్వహించారు. ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, కార్యదర్శి కె.రాజశేఖర్, డీపీఎం బి.హేమంత్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు డీవీ సింహాచలం, కె.విజయలక్ష్మి యానిమేటర్లు పాల్గొన్నారు.

అనపర్తి అభ్యర్థిగా నల్లమిల్లిని కొనసాగించాలి

పందలపాకలో టీడీపీ, జనసేన శ్రేణుల నిరసన దీక్షలు

అనపర్తి, మార్చి 26: అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు మొదటి జాబితాలో అభ్యర్థిత్వం ఖరారు చేసిన విధంగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిక్కవోలు మండలం పందలపాకలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు నిరసన దీక్షలు నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలోనే కొనసాగుతున్న నల్లమిల్లి కుటుంబాన్ని కాదని బీజేపీకి ఇచ్చే ప్రయత్నాలపై అధిష్టానం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో పడాల సూర్యనారాయణరెడ్డి, ముత్తారెడ్డి నారాయణరావు, వల్లూరి రామ కృష్ణ, సబ్బారపు సూరిబాబు, కానూరు శంకరరావు, అనుసూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి అమానుషం : మాచరయ్య

దివాన్‌చెరువు, మార్చి 26: భగవంతుడికి, భక్తులకు మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించే అర్చకులపై దాడికి పాల్పడడం అమానుష చర్య అని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య అన్నారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాకినాడలోని శివాలయంలో ఇద్దరు అర్చకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దేవాలయాలు, అర్చకులపై ఇప్పటికే అనేకచోట్ల దాడులు జరిగాయని, కాకినాడలోని అర్చకులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు 34 మంది గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 26: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన బయలాజికల్ సైన్సు పరీక్షకు 34 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. 738 మంది హాజరు కావల్సి వుండగా బిక్కవోలు సెంటర్‌లో 11 మంది, ఇళ్లపల్లిలో ఏడుగురు, బలభద్రపురంలో ఇద్దరు, పందలపాక-బి సెంటర్‌లో 14 మంది హాజరు కాలేదన్నారు.

రంగంపేటలో 27 మంది గైర్హాజరు

రంగంపేట, మార్చి 26: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జడ్పీ హైస్కూళ్లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ఆరవ రోజు నిర్వహించిన బి.ఎస్ పరీక్షకు 654 మంది విద్యార్థులకు గాను 627 మంది విద్యార్థులు హాజరు కాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు.





గామన్ బ్రిడ్జిపై ఆందోళన చేస్తున్న కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు



బ్రిడ్జి కుంగిన ఎత్తు చూపుతున్న ముప్పిడి

వంతెనల చెంతనే.. ఇసుక తవ్వేశారు..

- గామన్ బ్రిడ్జి కుంగడానికి వైసీపీ నాయకులే కారణం
- నిబంధనలు మీరి.. అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్
- వంతెనపై టీడీపీ నాయకుల ధర్నా

కొవ్వూరు, మార్చి 26 : వైసీపీ నాయకుల అక్రమ ఇసుక డ్రెడ్జింగ్ కారణంగానే గామన్ వంతెనకు ముప్పు వాటిల్లిందని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటి సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరిల ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై 52వ స్తంభం వద్ద మరమ్మతులకు గురైన స్పాన్‌ను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పరిశీలించారు. గోదావరిలో అక్రమ డ్రెడ్జింగ్‌కు పాల్పడుతున్న వారిపై ఎన్నికల కమిషన్ క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు అఖండ గోదావరి గర్భాన్ని కొల్లగొట్టి ఇసుకను దోచుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో ఇసుకను ఆదాయ వనరుగా మాత్రమే చూసుకుంటూ నిబంధనలు గాలికొదిలేశారన్నారు. గోదావరి వంతెనలకు 500 మీటర్ల లోపు ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టకూడదని నిబంధనలున్నా పట్టించుకోవడం లేదన్నారు.ఈ ఐదేళ్ల పాలనలో వంతెనల చెంత ఇసుక తవ్వకాలు చేపట్టడంతో రోడ్ కం రైలు బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందన్నారు. ఇప్పుడు గామన్ బ్రిడ్జికి ఆ పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలకు తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా ఇసుకను విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు చేపట్టి దోచుకోవడమే కారణమన్నారు. గోదావరి వంతెనల చెంతనే రాత్రి, పగలు తేడా లేకుండా భారీ యంత్రాలు పెట్టి ఇసుక డ్రెడ్జింగ్ చేసి బయట ప్రాంతాలకు ఇసుక తరలించి లక్షల కోట్లు దోచుకున్నారన్నారు.గామన్ వంతెన బేరింగ్ పోయిందని ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. బేరింగ్‌కు, పిల్లర్లకు సంబంధం ఏమిటన్నారు. నిపుణులను తీసుకువచ్చి గామన్ వంతెనను పూర్తిస్థాయిలో పటిష్ట పర్చాలన్నారు. అక్రమంగా ఇసుక డ్రెడ్జింగ్ చేసి గామన్ వంతెన కుంగిపోవడానికి కారణమైన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పొట్ర శ్రీనివాసరావు, వేమగిరి వెంకట్రావు, కాగిత రఘు, యనమదల సుబ్రహ్మణ్యం, బర్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు బొండాడ సత్యనారాయణ, కండెల్లి రామారావు, కిలారి వెంకటలక్ష్మి, కిలారి రమణ, జాగారపు వీరబాబు, జనసేన నాయకులు డేగల రాము, గంగుమళ్ల స్వామి మారిశెట్టి వెంకటేశ్వర రావు, కొప్పాక విజయకుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

ఇసుక డ్రెడ్జింగ్‌తో ముప్పు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26: ఇసుక డ్రెడ్జింగ్ చేయడమే గామన్ బ్రిడ్జి కుంగిపోవడానికి కారణమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద ఉన్న ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గోదావరిలో అక్రమంగా జరుగుతున్న ఇసుక డ్రెడ్జింగ్ కారణంగానే గామన్ బ్రిడ్జికి ముప్పువాటిల్లిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ఇసుక దోపిడీ చేయడం వల్ల పిల్లర్లు కుంగిపోతున్నాయన్నారు. ఇదే పరిస్థితి రోడ్ కం రైలు బ్రిడ్జికి దాపురించిందన్నారు. అక్రమ ఇసుక తవ్వకాల వల్ల గోదావరి నదిపై ఉన్న బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. రాజమహేంద్రవరం ప్రజలకు మళ్లీ పాత రోజులు వచ్చేలా ఉన్నాయన్నారు.మా చిన్నతనంలో కొవ్వూరు వెళ్లాలంటే గోదావరి పంటు ఎక్కి కొవ్వూరులో దిగి అక్కడ నుంచి వెళ్లేవారమని.. మళ్లీ ఆ పరిస్థితులు జగన్ దయవల్ల వస్తాయోమో అన్నారు. గామన్ బ్రిడ్జి స్తంభం కుంగిపోవడం, ఇసుక తవ్వకాలపై న్యాయస్థానం జోక్యం చేసుకుని సమగ్రవిచారణ జరిపించి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు జక్కంపూడి అర్జున్ పాల్గొన్నారు.

పంకా.. పక్క చూపు..



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ముందే పంకా రెక్కలు ఎగిరిపోతున్నాయి. గాలి కబుర్లకు వేగలేక పసుపు వసంతంలోకి ఆ పార్టీ నాయకులు అడుగు పెడుతున్నారు. కొందరు సొంతింటికి చేరుకున్న ఆనందంలో ఉండగా.. మరికొందరు ఢోకా లేని కండువా నీడలోకి వచ్చామన్న సంతోషంలో ఉన్నారు.నాలుగేళ్ల పది నెలల పాటు 'గాలి'వాటం భరిస్తూ.. అహంకారం, దర్పాలకు అణిగిమణిగి ఉన్నారు. సముచిత స్థానం, తగిన గౌరవం లేకపోయినా సర్దుకుపోయారు. ఇంక భరించలేమంటూ టీడీపీని ఆశ్రయిస్తున్నారు. టీడీపీ,బీజేపీ,జనసేన కూటమి బలంగా ఉత్సాహంగా ఉరకలు వేయడంతో ఆ దారిని తమ రాజకీయ మార్గంగా ఎంచుకుంటున్నారు. వైసీపీలో ఉక్కపోత తట్టుకోలేక పసుపు కండువా నీడకు చేరుకుంటున్నారు. జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇలా మండల,జిల్లా స్థాయి నాయకులు ఇప్పటికే పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలతో 'టచ్'లో ఉన్నారనే ప్రచారం నడుస్తోంది.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే రోజూ వందల సంఖ్యలో వైసీపీ నుంచి వలస పక్షులు సైకిల్ ఎక్కుతున్నాయి. వీరిలో యూత్ భాగం కూడా చెప్పుకోదగిన స్థాయిలో ఉండడం విశేషం.

వర్గపోరును తట్టుకోలేక..

వర్గపోరు, అహంభావానికి వైసీపీ పెట్టింది పేరు. పైగా ఎప్పుడు ఎవరిని ఎక్కడి నుంచి పీకేసి ఎక్కడికి పంపిస్తారో తెలియని పరిస్థితి. అందువల్ల ఆయా నాయకుల కేడర్ అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది. ఎప్పుడు ఎవరికి జైకొట్టాలో తెలియని పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతోంది. దీంతో వైసీపీ నాయకులు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నుంచి గోడదూకిన వారికి పెద్దపీట మాట ఎలా ఉన్నా సముచిత స్థానం కూడా ఇప్పటి వరకూ వైసీపీలో దక్కలేదు. టీడీపీలో నగర, ఉన్నతస్థాయి పదవులు అనుభవించిన వారు కూడా వైసీపీ పంచన చేరారు. ఇప్పుడు వారి రాజకీయ జీవితం కుడితిలో పడ్డ ఎలక మాదిరి తయారైంది. అటు వైసీపీ పెద్దలను గట్టిగా నిలదీయలేక.. ఇటు సొంత గూటికి చేరడానికి ముఖం చెల్లక సతమతమవుతున్నారు. ఉదాహ రణకు టీడీపీలో కార్పొరేటర్‌గా పదవి అలంకరించిన వారికి వైసీపీలోకి దూకిన తర్వాత కనీసం వీధి నాయకులకు ఉన్న పాటి గౌరవం దక్కకపోవడం గమనార్హం. అయితే అలాంటి వాళ్లను బుజ్జగించే పనిలో భాగంగా నేతలు బూటకపు మాటలు చెబుతున్నారని తెలుస్తోంది. మళ్లీ ప్రభుత్వం వస్తే పెద్ద పదవులు మెడలో వేస్తామంటూ ప్రగల్భాలతో నెట్టుకు వస్తున్నారని, బుజ్జగిస్తున్నారని సమాచారం. అయితే వారి మాటలు నమ్మే పరిస్థితి లేకపోవడంతో చాలా మంది టీడీపీ, జనసేనలో చేరడానికి సిద్ధం అవుతున్నారు.

వైసీపీ ఖాళీ అవుతోందా?

కొవ్వూరు నియోజకవర్గంలోని వైసీపీలో రెండు వర్గాల నడుమ పోరు సాగుతోంది. సాధారణంగా రెండు వర్గాలతో అగ్రనేతలు మాట్లాడి సర్దుబాటు చేస్తుంటారు. అయితే ఇక్కడ ఒక వర్గాన్ని వైసీపీ పెద్దలు లెక్కలోకి తీసుకోకపోవడం వారిని తీవ్రంగా కలచివేస్తోంది. దీంతో ఒక వర్గం టీడీపీ బాట పట్టడానికి 'సిద్ధం'గా ఉంది.ఇద్దరు ఎంపీపీలు, ఒక జడ్పీటీసీ కూడా టీడీపీ వైపు చూస్తున్నారు. దీంతో కొద్ది రోజుల్లో ఆ నియోజకవర్గంలోని దాదాపుగా వైసీపీలో 'గాలి' తప్ప జనాలు మిగలని పరిస్థితి రావొచ్చు. నిడదవోలులో ఒక మహిళ అనధికార ఆధిపత్యానికి పోసగలేక చాలా మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు బాధపడిన రోజులు చాలానే ఉన్నాయి. ఇప్పటికీ పరిస్థితిలో మార్పు రాక టీడీపీ కండువా కప్పుకోడానికి 'సిద్ధం' అవుతున్నారు. పలువురు జనసేన నాయకులతో టచ్‌లో ఉన్నారు.రాజమహేంద్రవరంసిటీ నియోజకవర్గంలో మాజీ కౌన్సిలర్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒకరు టీడీపీ కండువా కప్పుకోడానికి ముహూర్తం పెట్టుకున్నారు. వైసీపీ నగర కమిటీ నాయకుడు ఇప్పటికే టీడీపీలోకి వచ్చారు. ప్రతి వార్డు నుంచీ సుమారు 200 మంది వరకూ టీడీపీలో చేరారు. ప్రతి రోజూ చేరికలు ఉంటున్నాయి. సారంగధర మెట్ట ప్రాంతానికి చెందిన 100 మంది మహిళలు సైకిలెక్కారు.రాజానగరంలో జనసేన, టీడీపీలో చేరికలు ఎక్కువగా ఉంటున్నాయి.గోకవరం మండలానికి సంబంధించి మాజీ సొసైటీ ఛైర్మన్ గాజింగం సత్యనారాయణ టీడీపీలో చేరారు. రెండు రోజుల్లో జనబలం బాగా ఉన్న నాయకుడు, జగ్గంపేట మార్కెట్ యార్డు ఛైర్మన్, మాజీ ఎంపీపీ జనపరెడ్డి సుబ్బారావు(బాబు) టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఫ్యాను కింద నుంచి పరుగున వచ్చి సైకిలెక్కడానికి మండలస్థాయి అగ్రనాయకులు ముహూర్తాలు పెట్టుకున్నారు.గోకవరం మండలంలో ఇంత పెద్ద ఎత్తున వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఇదే మొదటిసారని చెబుతున్నారు.

వైసీపీలో వలసలసల

- సైకిలెక్కుతున్న వైసీపీ నాయకులు
- కూటమి వైపు భారీగా చూపు
- అన్ని నియోజకవర్గాల్లోనూ క్యూ
- కుటుంబాలతో సహా చేరిక
- ఫ్యాన్ కింద ఉక్కబోత
- తట్టుకోలేక బయటకు
- గోకవరంలో రికార్డు

ఇక్కడ బెదిరింపులేనా?

జగన్నాటకంలో ఎన్నో చిత్రాలు చూస్తున్న జనం ఈ విషయం వింటే విస్తుపోతారు. గ్రామాలు, మండలాల్లో జనసేన, టీడీపీలోకి చేరుతున్న నాయకులు, కార్యకర్తల వద్దకు ఆయా ప్రాంతాల్లోని 'పలుకుబడి' ఉన్న వైసీపీ వారిని పంపించి బెదిరిస్తున్నారని..అవతలి వైపు కాస్త బలం ఉన్న నాయకుడైతే నయాన వారిని 'సిద్ధం' చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి.ఇటు సిటీల్లో వార్డుల్లోని కుర్రాళ్లకు కండువాలు కప్పేసి లెక్కల్లోకి లాగేస్తున్నారని చెబుతున్నారు. ఇలా వైసీపీ అవతల పార్టీ నాయకులను భయపెడుతోంది.



మహిళా నేతలతో మాట్లాడుతున్న భువనేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత చిత్రంలో ఎస్పీ జగదీశ్ తదితరులు

తేలని అనపర్తి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- కూటమికి మరో కొత్త తలనొప్పి
- అనపర్తి సీటుకు బీజేపీ పట్టు
- కుదరదంటున్న స్థానిక టీడీపీ కేడర్
- జఠిలంగా మారిన సమస్య
- ప్రకటించిన సీటుకు మళ్లీ పోటీ
- అయోమయంలో పార్టీ శ్రేణులు
- లేదంటే మరో స్థానానికి బీజేపీ పట్టు?

తెలుగుదేశం- జనసేన-బీజేపీ జోష్‌ను ఓ అసెంబ్లీ సీటు ఇబ్బంది పెడుతోంది. జిల్లాలో ఒక లోక్‌సభ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వాస్తవానికి ఏడు అసెంబ్లీ స్థానాలు, లోక్‌సభ స్థానానికి అభ్యర్థులు ఖరారయ్యారు. కానీ బీజేపీ అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని కోరుతుండడంతో సమస్య ఏర్పడింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే ఐదు స్థానాల్లో టీడీపీ, రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులను ఖరారు చేశారు.ఇప్పటికే టీడీపీ తన అభ్యర్థిని ప్రకటించిన అనపర్తి స్థానం కోసం బీజేపీ పట్టుపట్టడంతో సమస్య జఠిలమైంది. ఇక్కడ టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సంగతి తెలిసిందే. పైగా రామకృష్ణారెడ్డి ఇక్కడ బలమైన అభ్యర్థి. పైగా ఆయన తండ్రి మూలారెడ్డి, రామకృష్ణారెడ్డి టీడీపీలో నుంచే పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. అనపర్తిలో టీడీపీ అంటే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబమే గుర్తుకొస్తుంది. ఆయన నిత్యం సమస్యలపై పోరాటాలు చేస్తుంటారు. టీడీపీ అధిష్ఠానంతో కూడా సన్నిహితంగా ఉంటారు. ఇవాళ అనూహ్యంగా ఈ సీటు బీజేపీ కోటాలోకి పోతుందంటే టీడీపీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఇప్పటికే సుమారు 60మందికి పైగా తమ పదవులకు రాజీనామా చేశారు. రామకృష్ణారెడ్డిని ప్రచారానికి కూడా కేడర్ వెళ్లనీయడంలేదు. కూటమికి అనపర్తి టికెట్ తలనొప్పిగా మారింది. ఈ సీటు విషయంలో అధిష్ఠానం ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం, జనసేన ముందుగా తొలిజాబితా ప్రకటించాయి. తర్వాతే బీజేపీతో పొత్తు కుదిరింది. మొదట్లోనే బీజేపీతో పొత్తుకుదిరినా లేక పొత్తు కుదిరి కేటాయింపులు జరిగిన తర్వాతే అభ్యర్థులను ప్రకటించినా మరోలా ఉండేది. సీటు ప్రకటించిన తరువాత అదే సీటు కావాలనడంతో సమస్య వచ్చిపడింది. గతంలో రూరల్ సీటు విషయంలో టీడీపీ- జనసేన మధ్య కొంత సమస్య ఏర్పడింది. దానిని జాగ్రత్తగా పరిష్కరించి ఊపిరి పీల్చుకున్న తెలుగుదేశం, జనసేన అధిష్ఠానాలకు ఇవాళ బీజేపీ ఒక సీటును అడగడం సమస్యగా మారింది. లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే అసెంబ్లీ అభ్యర్థుల జాబితా కూడా ప్రకటించాల్సి ఉంది. కానీ బీజేపీలో కొందరు సీనియర్లు అనపర్తి లేదంటే జిల్లాలో మరో చోట కేటాయించాలని పట్టుపడుతున్నట్టు సమాచారం. ఇక్కడ ఎంపీ సీటు బీజేపీకి కేటాయించిన తర్వాత మరొక చోట అసెంబ్లీ సీటు తీసుకుంటే బావుంటుందని టీడీపీ,జనసేన వర్గాలు భావిస్తుంటే జిల్లాలోనే కావాలని బీజేపీ పట్టుపడుతుండడం తలనొప్పిగా తయారైంది. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల ప్రకటన ఆలస్యమవుతూ వస్తోంది.బహుశా బుధవారం బీజేపీ జాబితా ప్రకటించకపోతే రెండు రోజుల సమయం పడుతుందనే వాదన ఉంది. ఈ బీజేపీ టికెట్ తేలకపోవడంతో జిల్లాలో ప్రచారం ఊపందుకోవాల్సిన సమయంలో కేడర్ ఆందోళన చెందే పరిస్థితులు నెలకొన్నాయి. రేపో మాపో ఈ సమస్యకు తెరపడితే, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇక యుద్ధానికి సిద్ధమైనట్టే.

నల్లమిల్లికి.. న్యాయం చేయండి

భువనేశ్వరిని కలిసిన టీడీపీ నాయకులు

అనపర్తి/కోరుకొండ, మార్చి 26 : అనపర్తి సీటుపై టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన ప్రకటన చేయాలని మంగళవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళా నేతలు కోరారు. నిజం గెలవాలి కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్న భువనేశ్వరిని అనపర్తి మహిళా నేతలు కలిశారు.అనపర్తి సీటును బీజేపీకి కేటాయిస్తున్నారన్న వార్తలతో తామంతా ఆందోళన చెందుతున్నామని అనపర్తిలో బీజేపీకి బలం లేనందుకు రేపు సీటు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి నల్లమిల్లికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. భువనేశ్వరి మాట్లాడుతూ తాను సీట్ల విషయంలో జోక్యం చేసుకోలేదని అయితే రామకృష్ణారెడ్డి చేసిన పోరాటాలు తనకు తెలుసునని నల్లమిల్లికి అన్యాయం జరగదని.. తాను చంద్రబాబుతో మాట్లాడతానని ఎవరూ కంగారు పడవద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ నేతలు కర్రి శేషారత్నం, జుత్తుగ సూర్యకుమారి, కర్రి సత్యగౌరి, వనుము మల్లేశ్వరి, ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణీ, నాయకులు, జుత్తుగ కృష్ణ, కర్రి వెంకటరామారెడ్డి,తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా పత్రాలతో మూకుమ్మడిగా టీడీపీ నాయకులు

అనపర్తిలో టీడీపీ పదవులకు 47 మంది రాజీనామా

అనపర్తి, మార్చి 26 : అనపర్తి సీటుపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నప్పటికీ స్పందన రాకపోవడంతో మంగళ వారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని జిల్లా రాష్ట్ర పార్టీ పదవులు పొందిన 47 మంది నాయకులు తమ పదవు లకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను జిల్లా తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు కర్రి శేషారత్నానికి అందజేసి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపాలని సూచించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో సమావేశమైన నియోజకవర్గ నాయ కులు రాజీనామాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నాయకురాలు కర్రి శేషారత్నం మాట్లాడుతూ అనపర్తి సీటు మార్పు చేస్తున్నారన్న వార్తలపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వక పోవడంపై తామంతా ఆందోళన చెందామని అందుకే తమ జిల్లా రాష్ట్ర పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేశామన్నారు. అనపర్తి టికెట్‌పై స్పష్టత ఇచ్చి నల్లమిల్లిని అభ్యర్థిగా కొనసాగిస్తే రాజీనామాలను ఉప సంహరించు కుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి,మామిడిశెట్టి శ్రీను, తేనెల శ్రీనివాస్, చౌదరి, కర్రి శేషారత్నం, వనుము మల్లేశ్వరి, జుత్తుగ సూర్యకుమారి, ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణి,కర్రి సత్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం,మార్చి26(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. ఎన్‌కోర్ నోడల్ అధికారులు, ఇతర అనుబంధ అధికారులతో మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో సువిధా అంశంపై మంగళవారం సమీక్షించారు. వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సువిధా యాప్ ద్వారా ప్రచార అనుతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని పార్టీలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రచార సభల నిర్వహణకు సమాన అవకాశాలు ఉండే విధంగా అనుమతులు జారీ చేస్తామన్నారు. అనుమతుల విషయంలో సంబంధిత అధికారులంతా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.సమావేశంలో ఎస్పీ పి.జగదీష్, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, నోడల్ అధికారులు ఎ.ముఖలింగం, పీఎం సత్యవేణి, డీఎస్పీ కె.శ్రీనివాసులు, జిల్లా అగ్నిమాపక అధికారి సిహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, రవాణా అధికారి సిహెచ్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టు పెడితే జైలుకే : ఎస్పీ

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై మరింత నిఘా పెట్టామని ఎస్పీ జగదీశ్ తెలిపారు. ప్రతి పోస్టుకూ గ్రూప్ అడ్మిన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతి సభ్యుడూ గ్రూప్ అడ్మిన్‌కి తెలిసి ఉండాలన్నారు. ఎవరైనా సభ్యుడు అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడం, షేర్లు చేయడం చేస్తే వెంటనే గ్రూపు నుంచి తొలగించక పోతే అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అడ్మిన్ వివాదాస్పద పోస్టు పెడితే ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయన ఒక పోస్టర్‌ని ఆవిష్కరించారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

దరఖాస్తు 48 గంటల ముందే చేయాలి

ఒక రూట్‌లో ఒక పార్టీకి, లేదా ఒక అభ్యర్థికి అనుమతి ఇస్తే అదే రూట్‌లో అదే సమయంలో వేరేవారికి అనుమతి ఇచ్చే అవకాశం ఉండదు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ప్రజల దృక్కోణంలో అభ్యంతరకరమని తేలితే ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే అనుమతిని రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. సభలు,సమావేశాలు, మైక్ ప్రచారం నిమిత్తం నిర్ణీత రుసుమ చెల్లించాలి. ఫార్మాట్‌కు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రచార సమయంలో ఎంత మంది పాల్గొంటారు.. ఎన్ని వాహనాలు ఉంటాయో వివరాలు అందజేయాలి. ప్రచా రానికి వినియోగించే వాహనాలు, రికార్డులు ఆర్టీవో ద్వారా నిర్ధారణ చేసుకోవాలి.ఇంటింటికీ ప్రచారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే చేయాలి. కరపత్రాలు పంపిణీ చేస్తుంటే వాటిపై ప్రచురణకర్త పేరు, ముద్రించిన కాపీల సంఖ్య ఉండాలి. ఏదైనా దరఖాస్తు తిరస్కరిస్తే .. అభ్యంతరాలు సరిచేసుకుని మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. అనుమతులకు 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. సువిధా పోర్టల్‌లో సమాచారం అందుబాటులో ఉంటుంది.

కోమలి రియల్ ఎస్టేట్ వ్యాపారికి మూడేళ్ల జైలు

అధిక రాబడి ఆశ చూపి మోసం

దేవరపల్లి పాఠశాలలో గ్యాస్ లీక్ స్వల్ప అగ్నిప్రమాదం

- వంట చేస్తుండగా మంటలు
- వెంటనే అదుపు చేసిన సిబ్బంది

8

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేఎస్ జవహర్

మాజీ మంత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కెఎస్ జవహర్‌ను టీడీపీ అధిష్ఠానం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఇంత వరకూ లోకేశ్ ఒక్కరే జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. అయితే జవహర్‌కు ఆ స్థానం కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఉపాధ్యాయ వృత్తి నుంచి ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. -8లో

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జవహర్



కొవ్వూరు, మార్చి 26: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సామ్యూల్ జవహర్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్టానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జవహర్ నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరిపారు. జవహర్ మాట్లాడుతూ పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణ, రాష్ట్రాధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలు నెరవేర్చేందుకు, పాఠీర్త ఔన్నత్యాన్ని పెంచేందుకు అహర్నిశలు కృషిచేస్తానన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా దళితల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి పనిచేస్తానన్నారు.

'పది' సైన్సు పరీక్షకు 125 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 26: కొవ్వూరు పట్టణ, మండలంలో పదో తరగతి బయలాజికల్ సైన్సు పరీక్ష మంగళవారం జరిగింది. మొత్తం 8 పరీక్షా సెంటర్లలో 1562 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 1437 మంది హాజరయ్యారు. 125 మంది గైర్హాజరయ్యారయినట్టు డీవైఈవో కె.వాసుదేవరావు తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం



సమిశ్రగూడెం శివారులో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న వైసీపీ ఫ్లెక్సీ

నిడదవోలు, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మోడల్ కోడ్ ఆఫ్ కాంట్రాక్ట్‌ను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత స్పష్టమైన ఆదేశాలిచ్చినా నిడదవోలు మండలం సమిశ్రగూడెం అట్లపాడు గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలకు ఇలా వైసీపీ ఫ్లెక్సీలు దర్శనమిస్తూనే ఉన్నాయి. అధికార్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా ఫ్లెక్సీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు, మార్చి 26: నిడదవోలులోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు దాతల సహకారంతో మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు మాట్లాడుతూ పౌష్టికాహారం ద్వారా రోగుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా 72 మంది గర్భిణులు, బాలింతలు, రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేసారు. కార్యక్రమంలో పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు, రాంబాబు, శివకుమార్, ఖండవల్లి గోపాలస్వామి పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.4 లక్షలు స్వాధీనం

గోపాలపురం, మార్చి 26: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని జగన్నాథపురం గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల చెక్‌పోస్టులో మంగళవారం ఉదయం వాహనాల తనిఖీల్లో చేపట్టారు. జంగారెడ్డిగూడెం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారును తనిఖీ చేయగా కారులో ఎటువంటి రసీదులు లేని రూ.4 లక్షల నగదు పట్టుబడినట్టు ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు.

షిరిడిసాయి ఆలయ వార్షికోత్సవం



అనంతపల్లిలో బాబాను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

నల్లజర్ల, మార్చి 26: అనంతపల్లిలో షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు సూరవరపు అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో కాకడ హారతి, బాబాకు నదీస్నానం, విఘ్నేశ్వరపూజ, సాయిబాబాకు అభిషేకాలు, అఖండ దీపారాధన, మధ్యాహ్న, సంధ్య హారతి, భజన కార్యక్రమాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కొవ్వూరు, మార్చి 26: దొమ్మేరు సావరంలో మంగళవారం తాళ పూజ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్థానిక రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులు చెరుకూరి శ్రీను, పాలకుర్తి శ్రీను, జుగవరపు నాగేశ్వరరావు, కర్రి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్నికల నియమావళి పాటించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్వో శివజ్యోతి

గోపాలపురం, మార్చి 26: ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి రాజకీయ పార్టీ నాయకులు ప్రశాంతంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్వో శివజ్యోతి రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్‌బూత్‌లలో విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. దివ్యాంగులు ఓటు వినియోగించుకునేందుకు వీలుగా వీల్‌ఛైర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఓటర్ స్లిప్‌లను బీఎల్‌వోలు, వీఆర్వోలు మాత్రమే పంపిణీ చేయాలని చెప్పారు.

విద్యార్థినులకు క్రీడా పోటీలు



వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

నిడదవోలు, మార్చి 26: క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక, శారీరక సామర్థ్యం పెరుగుతుందని ప్రిన్సిపాల్ రుద్ర అన్నారు. నిడదవోలులోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సత్యసాయి, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

కొవ్వూరులో పిచ్చికుక్కల స్వైర విహారం

గోష్పాదక్షేత్రంలో ఓ వ్యక్తిపై దాడి



కొవ్వూరు, మార్చి 26: కొవ్వూరులో పిచ్చికుక్కలు పెరిగిపోయాయి. ఎక్కడ పడితే అక్కడ స్వైర విహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వాహనదారులను వెంబడించి, భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మంగళవారం సాయంత్రం గోష్పాదక్షేత్రంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన డి.సూరిబాబును కరిచింది. దీంతో స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. పట్టణంలో కుక్కలు పెరిగిపోయి ఇబ్బందులకు గురి అవుతున్నామని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు.

రాష్ట్రానికి బీజేపీ అన్యాయం : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26: రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేశాయని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో మంగళవారం నగర కార్యదర్శి కొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని, మానవత్వాన్ని మంటగలుపుతున్న బీజేపీని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు కె.జ్యోతిరాజు, చింతలపూడి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌కే కూటమి

- పలుచోట్ల ఎన్నికల ప్రచారం, ఆత్మీయ సమావేశాలు
- దుర్గేష్‌ను గెలిపించండి : మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



ఉండ్రాజవరం: వడ్లూరు సమావేశంలో దుర్గేష్‌ను పరిచయం చేస్తున్న శేషారావు

నిడదవోలు/ఉండ్రాజవరం, మార్చి 26: నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్‌కు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం మునిపల్లి, కలవచర్ల, ఉండ్రాజవరం మండలం సత్యవాడ, పసలపూడి, రెడ్డిచెరువు, వడ్లూరు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ దుర్గేష్ గతంలో రెండు సార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవశాలియని విజ్ఞానవంతుడని అన్నారు. అటువంటి వ్యక్తిని గెలిపించుకోవాలని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే మూడు పార్టీలు కలసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు దుర్గేష్ చెప్పారు. కార్యక్రమాల్లో జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్, టీడీపీ నిడదవోలు మండలాధ్యక్షుడు వెలగన సూర్యారావు ఉండ్రాజవరం మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, వీరమళ్ల బాలాజీ, కాకర్ల నాని, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి : అనిల్

దేవరపల్లి, మార్చి 26: టీడీపీ అంతా ఒక కుటుంబమని, ఎవరినైతే అభ్యర్థులుగా ప్రకటించారో వారిని గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై



దేవరపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆంద్రూ అనీల్

ఉందని పార్టీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనీల్ అన్నారు. దేవరపల్లిలోని టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల నుంచి మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావులను అధిష్టానం ప్రకటించిందని వారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవల్సిన బాధ్యత మనపై ఉందని, పార్టీ అసమ్మతివాదులు సోషల్ మీడియా ద్వారా అవాకులుచవాకులు పలకడం వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని, ప్రతిఒక్కరు పార్టీ విజయం కోసం కలిసి రావాలని పేర్కొన్నారు. మద్దిపాటి, ముప్పిడిలకు అధిష్టానం న్యాయం చేసిందని, పార్టీ అసమ్మతి వాదులు విభేదాలు విడనాడి పార్టీ విజయానికి కలిసి కృషి చేస్తే తామంతా మీ వెంట ఉంటామని అనీల్ అన్నారు. కార్యక్రమంలో కంటిపూడి సుబ్బారావు, ఉప్పులూరి రాంబాబు, బొల్లిన భాస్కర్, సాంబా సూర్యచంద్రం, కొరారు ధ్రువకాంత్, ముళ్ళపూడి సత్యనారాయణ, సుదురుమాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్ పతనం ఖాయం : మద్దిపాటి

గోపాలపురం, మార్చి 26: అధికార పార్టీ ఎన్ని కుతంత్రాలు పన్నిన రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి పతనం కావడం ఖాయమని కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని కోమటిగుంట, కరిచర్లగూడెం గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరిచర్లగూడేనికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు గారపాటి ధనరాజు, శాంతకుమారి దంపతులతో పాటు మరో 20మంది కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ నాయకుడు అనిసెట్టి త్రిమూర్తులు నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిపాటి మాట్లాడుతూ విజనరీ చంద్రబాబు, పోరాట ప్రతిమ కలిగిన పవన్‌కల్యాణ్, అభివృద్ధికి బాటలు వేసే మోదీ కలయికతో అటు దేశం ఇటు రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతాయన్నారు. పల్లెలను అభివృద్ధికి ఆమడ దూరంలోనే నిలబెట్టిన జగన్‌రెడ్డిని ప్రజలు చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు మగ్బుల్ భాష, స్వామి, పటాన్‌రహీం, మీసాల త్రిమూర్తులు, చెన్నంశెట్టి మణికంత శ్రీను, రొంగలి సత్యనారాయణ, నూతంగి దొరబాబు, వడ్లమూడి రమేష్, భూరెడ్డి వాసు, కూనపం ప్రసాద్‌బాబు, వేముల నాగరాజు పాల్గొన్నారు.



కరిచర్లగూడెంలో ధనరాజును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మద్దిపాటి

మద్య నిషేధంపై మాట తప్పిన జగన్ : ముప్పిడి

కొవ్వూరు, మార్చి 26: మద్య నిషేధం చేసి ఓటు అడుగుతానన్న జగన్ మాట తప్పి మడప తిప్పాడని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో కొవ్వూరులో టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాసిరకం మద్యంతో లివర్, కిడ్నీలు చెడిపోయి 30 వేలమంది ప్రాణాలు పోయాయన్నారు. టీడీపీ హయాంలోని అన్న క్యాంటీన్లు, విదేశీ విద్య, చంద్రన్న బీమా వంటి 100 పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. కరెంటు చార్జీలు తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక 9 సార్లు పెంచారన్నారు. మెగా డీఎస్సీ అని దగా చేశాడన్నారు. ప్రత్యే హోదా తెస్తానని రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. ఇసుక ధర నాలుగు రెట్లు పెంచి భవన నిర్మాణ కార్మికుల ఉపాధి దెబ్బతీశాడని, చంద్రబాబు 16 లక్షల మందికి ఫీజు రియంబర్స్‌మెంటు ఇవ్వగా జగన్ 9 లక్షలకు కుదించాడని, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని, కార్మికులను రెగ్యులర్ చేస్తానని మాట తప్పాడని ముప్పిడి విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, యనమదల సుబ్రహ్మణ్యం, మద్దిపట్ల సురేష్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో కొవ్వూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుకు, న్యాయవాదుల సంక్షేమానికి నిధి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను పలువురు న్యాయవాదులు సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి, ఐవీ రమణమూర్తి, వీవీ సుబ్బారావు, నీరుకొండ సూర్యనారాయణ, టి.చిట్టిబాబు, పిల్లలమర్రి మురళీకృష్ణ, టీఎస్వీ రమణమూర్తి, రాజాన శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొవ్వూరులో న్యాయవాదులతో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

నారా భువనేశ్వరికి ఘన స్వాగతం



నారా భువనేశ్వరికి గోపాలపురంలో స్వాగతం పలుకుతున్న మద్దిపాటి

గోపాలపురం/కోరుకొండ, మార్చి 26: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలోని విమానాశ్రయానికి చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పారు. అనంతరం గోపాలపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆమెకు టీడీపీ శ్రేణులు స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా మద్దిపాటిని ఆమె ఆశీర్వదించారు. తదుపరి ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెం వెళ్లారు. కార్యక్రమంలో గోపాలపురం నుంచి మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, కొర్లపాటి రాము, జ్యేష్ఠ శ్రీను, వడ్లమూడి రమేష్, శరత్‌బాబు, కూనపం ప్రసాద్‌బాబు, కోరుకొండ నుంచి బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి పాఠశాలలో స్వల్ప అగ్నిప్రమాదం

వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు.. అదుపు చేసిన సిబ్బంది

దేవరపల్లి, మార్చి 26: దేవరపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం చేసే సందర్భంలో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించిందని ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయన్నారు. వెంటనే హెల్పర్స్ గమనించి ఉపాధ్యాయుల సాయంతో ఫైర్ ఎక్స్టింగ్ మిషన్ ద్వారా మంటలను అదుపు చేశారన్నారు. అయితే సదరు మిషన్ ద్వారా వచ్చిన వాయువు వల్ల ఆహార పదార్థాలు తినడానికి పనికి రాకుండా పోయాయని, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులు కూడా పాడయ్యాయన్నారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామన్నారు. కాగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యామ్నయ పద్ధతిలో అందించామన్నారు. ఈ సంఘటన వల్ల రూ.10 వేల వరకు నష్టం జరిగినట్టు తెలిపారు.

వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి

దుద్దుకూరులో లారీ కార్మికుల సమ్మె



దేవరపల్లి, మార్చి 26: కార్వీలారీ కార్మికుల వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజులుగా మండలంలోని దుద్దుకూరులో సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో దుద్దుకూరులోని యూనియన్ ఆఫీసు వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేసి వేతన ఒప్పందం కోసం మంగళవారం సమ్మె నిర్వహించారు. వివిధ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే.మస్తాన్, జాన్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు కలుగజేసుకుని లారీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్మిక హక్కుల చట్టాన్ని సమగ్రంగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్వీ యాజమానులు స్పందించి వేతన ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆకాష్, ఏడుకొండలు, కొండయ్య, బంగారయ్య శ్రీను, సత్యనారాయణ, పీ.బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అద్దాలు ధ్వంసం

నిడదవోలు, మార్చి 26: నిడదవోలులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. స్థానిక కొద్దిరోజులుగా ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌లో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉంటున్నారు. ఆది, సోమవారాలు సెలవులు కావడంతో ఆయన ఇంటికి వెళ్ళారు. ఈ సమయంలో దుండగులు కిటికీ అద్దాలు ధ్వంసం చేయడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



మీనానగరంలో కేంద్రబలగాలతో పోలీసుల కవాతు

చాగల్లు, మార్చి 26: ఓటర్లంతా స్వేచ్ఛగా, ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని చాగల్లు, మీనానగరం, ఊనగట్ల, నెలటూరు, నందిగంపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సులు జరిగాయి. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని, అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులు దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.నాగరాజు, రైటర్ వాసంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అధిక సొమ్ము రాబడి ఉంటుందని ఆశజూపి మోసం చేసిన కేసులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన కాకర్ల శ్రీనివాస చౌదరి... కోమలి రియల్ ఎస్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తుంటాడు. రాజమహేంద్రవరం టీనగర్‌లో ఓ కార్యాలయం తెరిచాడు. తణుకులో వెంచర్లు వేశామని పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని పలువురిని నమ్మించాడు. రూ.10 వేలు కడితే రోజుకు రూ.300 చొప్పున 300 రోజుల్లో మూడు రెట్లు అధికంగా పొందవచ్చని ఆశజూపాడు. వలలో పడిన కొందరికి రశీదులు కూడా ఇచ్చాడు. అయితే తర్వాత ముఖం చాటేశాడు. దీంతో 35 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావుకు మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్సు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ తీర్పు చెప్పారు. నేరస్తుడికి త్వరితగతిన శిక్ష పడడంలో చొరవ చూపిన డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ శ్రీనివాసరావు, పీపీ ఎంఎ బాషా, హెచ్‌సీ సీహెచ్ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి



సీతానగరం, మార్చి 26: గోదావరిలో మునిగి యువకుడు మృతిచెందిన విషాద సంఘటన ముగ్గళ్ల గ్రామంలో జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం గ్రామానికి చెందిన గోపల శివశంకర్ కుటుంబం రఘుదేవపురంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఉంటోంది. మంగళవారం ఉదయం శివశంకర్(21) తన స్నేహితులతో కలసి ముగ్గళ్లలోని గోదావరిలో స్నానానికి వెళ్లాడు. స్నేహితులు ముగ్గురు ఒడ్డున స్నానం చేస్తుండగా శివశంకర్ కొంతమేర లోపలికి వెళ్లగా మునిగిపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ సమర్పణరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం సుమారు 5గం.లకు మృతదేహం లభ్యమయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమర్పణరావు తెలిపారు. ఈ ఘటనతో రఘుదేవపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. కాగా గోదావరిలో నిబంధనలు అతిక్రమించి లోతుగా ఇసుక తవ్వకాలు జరిగాయని, ఆ గోతుల వల్ల మునిగిపోయినట్టు తెలుస్తోంది.

గోపాలపురం టీడీపీ అభ్యర్థిని మార్చాలి

పార్టీ అసమ్మతి వర్గం

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ టీడీపీ టిక్కెట్టు మద్దిపాటి వెంకట్రాజుకు కాకుండా వేరొకరికి ఇవ్వాలంటూ పార్టీ అసమ్మతి వర్గం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, ఇమ్మని సూరిబాబు డిమాండ్ చేశారు. గోపాలపురంలో కాకర్ల ఫంక్షన్ హాలు లో టీడీపీ అసమ్మతి వర్గ నాయకులు భారీ సంఖ్యలో హాజరై మద్దిపాటికి టిక్కెట్టు ఇవ్వొద్దు వేరొకరికి ఎవరికైనా ఇస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని ముక్తకంఠంతో తెలిపారు. మద్దిపాటి టిక్కెట్టు ఇవ్వొద్దని గతంలో అనేక సార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని అయినా టిక్కెట్టు ఇచ్చారని, ఆయన మండలంలో ఎవర్ని కలుసుకోకుండా ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో కూడా పార్టీ సీనియర్ నేతలను కలుసు కోకుండా ప్రచారం నిర్వహించారని... వెంకట్రాజుకు సీటు ఇవ్వొద్దంటూ ప్రతిజ్ఞ చేశారు. అభ్యర్థిని మార్చే వరకు పోరాటం ఆగదని... కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకరరావు, కొటారు వెంకటేశ్వరరావు, కరుటూరి శ్రీనివాస్, నిమ్మగడ్డ సత్యనారాయణ, శ్రీధర్, ఉండవల్లి శ్రీను, చింతపల్లి నాగమణి, పాముల భూలక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో విజిలెన్స్ సోదాలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీనగర్‌లో ఉన్న లక్ష్మీ గణేశ్ మిల్క్ డెయిరీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశాలతో సిబ్బంది సోదాలు చేశారు. ఒక వెన్న, రెండు నెయ్యి నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పంపించారు. ప్రమాణాలు లేని తక్కెడ, 5కిలోల పెరుగు బకెట్లపై వినియోగదారుల సంరక్షణ వివరాలు లేకపోవడం, వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ సిలిండర్లు వాడుతుండడం గుర్తించి కేసులు నమోదు చేశారు. సోదాల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి అమానుషం : మాచరయ్య

దివాన్‌చెరువు, మార్చి 26: భగవంతుడికి, భక్తులకు మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించే అర్చకులపై దాడికి పాల్పడడం అమానుష చర్య అని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య అన్నారు. మంగళవారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాకినాడలోని శివాలయంలో ఇద్దరు అర్చకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో దేవాలయాలు, అర్చకులపై ఇప్పటికే అనేకచోట్ల దాడులు జరిగాయని, కాకినాడలోని అర్చకులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు దంతాలపై శ్రద్ధ తీసుకోవాలి

బిక్కవోలు, మార్చి 26: విద్యార్థులందరూ దంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అనపర్తి ఏరియా ఆసుపత్రి దంత వైద్యురాలు డాక్టర్ సీహెచ్ భాగ్యలక్ష్మి సూచించారు. ప్రపంచ ఓరల్ హెల్త్ ఉత్సవాల సందర్భంగా ఆమె మంగళవారం బిక్కవోలులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు జరిపారు. ఉదయం, రాత్రి తప్పనిసరిగా దంతాలను శుభ్రపరచుకోవాలన్నారు. ఏప్రిల్ 20 వరకూ ప్రతి మంగళవారం ఈకార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తామన్నారు. ఈమె వెంట బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.దుర్గాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 34 మంది గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 26: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన బయలాజికల్ సైన్సు పరీక్షకు 34 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. 738 మంది హాజరు కావల్సి వుండగా బిక్కవోలు సెంటర్‌లో 11 మంది, ఇళ్లపల్లిలో ఏడుగురు, బలభద్రపురంలో ఇద్దరు, పందలపాక-బి సెంటర్‌లో 14 మంది హాజరు కాలేదన్నారు.

'పది' పరీక్షలకు 27 మంది గైర్హాజరు

రంగంపేట, మార్చి 26: మండలంలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జడ్పీ హైస్కూళ్లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మంగళవారం ఆరవ రోజు నిర్వహించిన బి.ఎస్ పరీక్షకు 654 మంది విద్యార్థులకు గాను 627 మంది విద్యార్థులు హాజరు కాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ పూజలు

గోకవరం, మార్చి 26: గోకవరంలో శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, మండప పునఃపూజలు, మన్యుసూక్త హోమం, సుబ్రహ్మణ్య హోమం, ఆవాహిత దేవతా మూలమంత్ర హోమం వైభవంగా జరిగాయి.

టాలెంట్ టెస్ట్‌లో గణేష్‌కు స్టేట్‌ఫస్ట్ ర్యాంక్

రాజానగరం, మార్చి 26: గత నెల 18న నిర్వహించిన గోదావరి టాలెంట్ టెస్ట్-2024లో తమ పాఠశాల విద్యార్థి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్టు దివ్య విద్యాసంస్థల ఛైర్మన్ బర్ల సత్యనారాయణ, కరస్పాండెంట్ బర్ల సుబ్బలక్ష్మి మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి గణేష్ గుప్త స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి